S TV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

**7036644111, 9490140565**

సంపుటి: 19 | సంచిక: 302 | ఎడిటర్ : అలీ ముర్తుజా | గురువారం 24 సెప్టెంబర్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల:రూ.5 |



## రాష్ట్ర భవిష్యత్తు, ఆర్థిక ప్రగతికి

# గ్లోబల్ సమ్మిట్

### తెలంగాణ ఆర్థిక ప్రగతిని కొత్త శిఖరాలకు చేర్చేలా ఏర్పాట్లు

- డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో మహాసదస్సు
- దేశ, విదేశాల్లో రోడ్‌షోలు.. రోజువారీ పర్యవేక్షణకు వార్‌రూమ్
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

రాష్ట్రానికి భారీగా అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే ప్రధాన ధ్యేయంగా 2026 డిసెంబర్ 7 నుంచి 9 వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026' ఏర్పాట్లను అత్యంత వేగవంతంగా, పక్కా ప్రణాళికతో పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. తెలంగాణ భవిష్యత్తును, ఆర్థిక ప్రగతిని కొత్త శిఖరాలకు తీసుకెళ్లే ఈ చరిత్రాత్మక ఘట్టంలో అధికార యంత్రాంగమంతా భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (సమయం న్యూస్):** రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా డిసెంబర్ 7 నుంచి 9 వరకు నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026'ను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. తెలంగాణ భవిష్యత్తు, రాష్ట్ర ఆర్థిక ప్రగతిని కొత్త శిఖరాలకు తీసుకెళ్లే చరిత్రాత్మక ఘట్టంగా ఈ సదస్సును తీర్చిదిద్దాలని సూచించారు. సదస్సు భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనుంది. సచివాలయంలో బుధవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సదస్సు ఏర్పాట్లు, ప్రచారం, దేశీయ, అంతర్జాతీయ రోడ్‌షోలు, పెట్టుబడిదారుల భాగస్వామ్యం తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. మిగతా 2 లో



## దసరాలోపు యాదాద్రి

# ఫుల్ పవర్

- పూర్తి సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తికి చర్యలు చేపట్టాలి
- బొగ్గు కొరతతో ఉత్పత్తిపై ప్రభావం.. ప్రత్యామ్నాయాలపై దృష్టి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి విద్యుత్ శాఖపై సమీక్ష

2

# రిమ్స్ ఘటనలో ఐదుకు చేరిన మృతుల సంఖ్య

బాధిత కుటుంబాలకు రూ.6.50 లక్షల ఆర్థికసాయం

- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ప్రభుత్వం తరపున రూ.5 లక్షల పరిహారం
- ప్రతిపక్షాల నుంచి మరో రూ.1.50 లక్షల ఆర్థిక సాయం ప్రకటన
- ఘటనపై మానవ హక్కుల కమిషన్ సుమోటో కేసు స్వీకరణ

2



# రైతు కన్నీటిలో ఓట్లు వెతకడమా?

- కరవుపై బీఆర్ఎస్ నీచ రాజకీయం
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ ఆగ్రహం
- నీటి కోసం కర్ణాటక సీఎంతో మంతనాలు.. సానుకూల స్పందన
- పంటలను కాపాడతాం.. వేసవిలో నీటి ఎద్దడి రానివ్వం
- నేరేడుచర్లలో 26.93 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

2

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి రైతాంగం తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న వేళ వారికి ధైర్యం చెప్పాల్సింది పోయి, పంటలు ఎండిపోవాలని కోరుకుంటూ బీఆర్ఎస్ నేతలు పైశాచికానందం పొందుతున్నారని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రైతు కన్నీటిలో ఓట్లు వెతకడం కంటే నీచమైన రాజకీయం మరొకటి ఉండదని మండిపడ్డారు. నేరేడుచర్ల మండలం మేడారం గ్రామంలో రూ.26.40 కోట్లతో నిర్మించిన నేరేడుచర్ల-దూపాడు డబుల్ రోడ్డుతో పాటు, రూ.20 లక్షలతో నిర్మించిన జానల్‌దిన్నె గ్రామ పంచాయతీ భవనం, రూ.33 లక్షల వ్యయంతో నిర్మించిన నేరేడుచర్ల గ్రంథాలయ భవనాన్ని మంత్రి బుధవారం ప్రారంభించారు. మొత్తం రూ.26.93 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఎల్‌నినో అనేది అంతర్జాతీయ స్థాయిలో వాతావరణంలో వచ్చే శాస్త్రీయ మార్పని, దీనివల్ల ఈసారి వర్షపాతం 40 శాతం తగ్గిందని వివరించారు.



# ఉద్యోగులకు ఊరట

- రెండు డీఏల చెల్లింపునకు ప్రభుత్వం అంగీకారం
- త్వరలోనే పీఆర్‌సీ నివేదిక.. సీపీఎస్ రద్దుపై అధ్యయన కమిటీ ఏర్పాటు
- ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి

2

# ఎన్నికల సంఘంలో 'విభేదాల' దుమారం

- పది నెలల్లో 14 సార్లు ఇద్దరు కమిషనర్ల అభ్యంతరాలంటూ కథనం
- ఓటర్ల జాబితా, ఫారం-6 మార్పులు, సమాచార కేంద్రీకరణపై ప్రశ్నలు
- అవి అభిప్రాయాలు మాత్రమే.. తుది నిర్ణయాలపై విభేదాలు లేవన్న ఈసీ

4




# ఈసీపై కాంగ్రెస్ అగ్రనేతల ఘాటు దాడి

- అక్రమాలకు ఈసీ సహకరిస్తే అది తీవ్రమైన 'దేశద్రోహ చర్య'
- ప్రియాంక, రాహుల్ గాంధీ
- ఓటు చోరీపై స్పందించిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

4



దేశంలో ఎన్నికల నిష్పాక్షికత, పారదర్శకతపై రాజకీయ రచ్చ పీక్ స్టేజ్‌కి చేరింది. కేంద్ర ఎన్నికల సంఘంలో అంతర్గత అభ్యంతరాలు, విభేదాలు ఉన్నాయంటూ ఓ ప్రముఖ ఆంగ్ల దినపత్రిక ప్రచురించిన కథనం ఆధారంగా కాంగ్రెస్ అగ్రనేతలు ఎన్నికల సంఘం పనితీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తుతున్నారు.



# మా భూముల హద్దులు నిర్ధారించాలి

3

- కలెక్టర్ కార్యాలయంలో రైతుల వినతిపత్రం
- కలకలం రేపుతోన్న ఎర్రవల్లి భూ సర్వే వివాదం

పాస్ పుస్తకాలు ఉన్న తమ భూములకు హద్దులు నిర్ధారించి న్యాయం చేయాలని కోరుతూ ఎంఆర్‌వో కార్యాలయం వద్ద వెంకటాపూర్ గ్రామానికి చెందిన రైతులు నిరసన తెలిపారు.

## డ్రగ్స్‌పై పోరాటం ఇంటి నుంచే

# ప్రారంభం కావాలి

తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా

ప్రభుత్వం, పోలీసులకే బాధ్యత పరిమితం కాదు..

సమాజమంతా కలిసి ఉద్యమించాలి

3





## ఎన్నికలకు ఇప్పటి నుంచే

# రెడీ కావాలి

- క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలి
- పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి
- బీజేపీ శ్రేణులకు రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు దిశానిర్దేశం

3

# కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయింది

- కాంగ్రెస్ పాలనలో విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- నాసిరకం బొగ్గుతో రూ.2,900 కోట్ల నష్టం..
- 80ల నాటి విద్యుత్ కష్టాలు పునరావృతం
- థర్మల్ ప్లాంట్ల పరిశీలనకు బీఆర్ఎస్ తరపున ఆరు ప్రత్యేక బృందాలు

3



# రాష్ట్ర భవిష్యత్తు, ఆర్థిక ప్రగతికి 'గ్లోబల్ సమ్మిట్'

మొదటి పేజీ తరువాయి

గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్ల పర్యవేక్షణకు దాదాపు పది ప్రత్యేక అధికారుల కమిటీలను ఏర్పాటు చేసినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఒక్కో కమిటీకి సీనియర్ అధికారి నేతృత్వం వహిస్తారని చెప్పారు. పనుల రూపకల్పన, బడ్జెట్ అంచనాలు, ఆమోదాల ప్రక్రియలో ఎలాంటి జాప్యానికి అవకాశం ఇవ్వొద్దని స్పష్టం చేశారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ నిర్ణీత గడువులో ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారుల కమిటీలతోపాటు సంబంధిత మంత్రుల నేతృత్వంలో కార్యనిర్వాహక మండళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా కమిటీల కన్వీనర్లు వెంటనే మంత్రులతో సమావేశమై బాధ్యతలు స్వీకరించి పనులు ప్రారంభించాలని సూచించారు. తెలంగాణలో పెట్టుబడులకు అవకాశమున్న రంగాలతోపాటు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపే దేశాలు, నగరాలను గుర్తించి దేశీయ, అంతర్జాతీయ రోడ్‌షోలు నిర్వహించాలని భట్టి ఆదేశించారు. ఏ దేశంలో ఏ రంగానికి పెట్టుబడి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయో అధ్యయనం చేసి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఆ ప్రణాళికను మంత్రివర్గ ఉపసంఘానికి సమర్పించిన అనంతరం రోడ్‌షోలను ప్రారంభించాలని చెప్పారు. గతంలో కుదిరిన అవగాహన ఒప్పందాలను కూడా సమీక్షించి వాటి అమలు ఎంతవరకు వచ్చిందో పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. కొత్త పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు ఇప్పటికే వచ్చిన పెట్టుబడి ప్రతిపాదనలను కార్యరూపంలోకి తీసుకురావడంపైనా దృష్టి పెట్టాలని సూచించారు. సదస్సు ఏర్పాట్లన్నింటినీ ప్రత్యేక వార్‌రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని భట్టి



సూచించారు. అధికారులు తమ బృందాలతో సమావేశమై రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, ప్రతి సాయంత్రం పనుల పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. గత నెలలో నిర్వహించిన సమీక్షలోనూ సదస్సుకు సంబంధించిన నిర్ణయాలను వేగంగా తీసుకునేందుకు ప్రత్యేక వార్‌రూమ్ ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. సదస్సును ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేసేందుకు పత్రికలు, టెలివిజన్, డిజిటల్, సామాజిక మాధ్యమ వేదికలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని భట్టి సూచించారు. అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. సదస్సుకు సంబంధించిన కార్యక్రమాలు, పెట్టుబడి అవకాశాలు నిరంతరం ప్రచారంలో ఉండేలా ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్య సాధనలో ఈ గ్లోబల్ సమ్మిట్ కీలక మైలురాయిగా నిలవాలని భట్టి పేర్కొన్నారు. సదస్సు ఏర్పాట్లను కేవలం మూడు రోజుల కార్యక్రమంగా కాకుండా రాష్ట్రానికి దీర్ఘకాలంలో ఉపయోగపడే పెట్టుబడుల వేదికగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు.

### తెలంగాణ సంస్కృతి ఉట్టిపడాలి: శ్రీధర్‌బాబు

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌ను పెట్టుబడుల సమీకరణకే పరిమితం చేయకుండా తెలంగాణ సంప్రదాయాలు, సాంస్కృతిక విశిష్టతను ప్రపంచానికి చాటే వేదికగా తీర్చిదిద్దాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సూచించారు. బతుకమ్మ ప్రాశస్త్యం, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రత్యేక వంటకాలు అతిథులను ఆకట్టుకునేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతోపాటు విదేశాల నుంచి వచ్చే ప్రతినిధులకు తెలంగాణ సాంస్కృతిక వైభవం గుర్తుండిపోయేలా కార్యక్రమాలు రూపొందించాలని చెప్పారు. సాయంత్రం నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో రాష్ట్ర కళలు, వారసత్వం, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ప్రణాళిక రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.



# రిమ్స్ ఘటనలో ఐదుకు చేరిన మృతుల సంఖ్య

**బాధిత కుటుంబాలకు రూ.6.50 లక్షల ఆర్థికసాయం**

**సీఎం ఆదేశాలతో ప్రభుత్వం తరఫున రూ.5 లక్షల పరిహారం**

**ప్రతిపక్షాల నుంచి మరో రూ.1.50 లక్షల ఆర్థిక సాయం ప్రకటన**

**ఘటనపై మానవ హక్కుల కమిషన్ సుమోటో కేసు స్వీకరణ**

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 23 (సమయం న్యూస్):** ఆదిలాబాద్ రాజీవ్ గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్) ఆసుపత్రిలోని స్పెషల్ న్యూ నియోనేటల్ కేర్ యూనిట్ (ఎస్ఎన్‌సీయూ)లో ఏసీ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు ఎగిసిపడి సంభవించిన అగ్నిప్రమాదంలో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. అక్కడ చికిత్స పొందుతున్న 27 మంది పసికందుల్లో ఇప్పటికే ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, బుధవారం మరో ఇద్దరు శిశువులు మృత్యువాత పడ్డారు. ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలం మల్లెగూడకు చెందిన దుర్గాబాయి కూతురు, ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం దుబ్బగూడకు చెందిన నాగుబాయి కూతురు మరణించిన వారిలో ఉన్నారు. మిగిలిన చిన్నారుల్లో నలుగురిని క్షేమంగా తల్లిదండ్రులు ఇళ్లకు తీసుకెళ్లగా, ఇతరులకు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వం తరఫున రూ.5 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రకటించారు. అలాగే, చికిత్స పొందుతున్న పిల్లలకు మెరుగైన వైద్యం కోసం అవసరమైతే హైదరాబాద్‌లోని ఆసుపత్రులకు తరలించాలని ఆదేశించారు. త్వరలోనే రిమ్స్‌లో 150 పడకలతో అత్యాధునిక మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

### బాధిత కుటుంబాలకు విపక్షాల భరోసా.. హెచ్ఆర్‌సీ తీవ్ర ఆగ్రహం:

రిమ్స్ ప్రమాద స్థలాన్ని అధికార, ప్రతిపక్ష నేతలు పరిశీలించారు. బీఆర్ఎస్ నేతలు, మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, జోగు రామన్న, ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవా లక్ష్మి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ ఇది ప్రభుత్వ హత్యేనని ఆరోపిస్తూ, బీఆర్ఎస్ తరఫున మృతుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున సాయం ప్రకటిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత రిమ్స్‌ను సందర్శించి, తమ పార్టీ తరఫున రూ.50 వేల పరిహారం ఇస్తామన్నారు. దీనితో ప్రభుత్వ సాయంతో కలిపి ఒక్కో బాధిత కుటుంబానికి మొత్తం రూ.6.50 లక్షల ఆర్థిక సాయం అందనుంది. మరోవైపు ఈ విషాద ఘటనపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ తీవ్రంగా స్పందిస్తూ సుమోటోగా కేసు నమోదు చేసింది. ఆసుపత్రి ప్రమాదం, చిన్నారుల మృతిపై ఈ నెల 27వ తేదీలోగా సమగ్ర విచారణ నివేదికను సమర్పించాలని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శికి హెచ్ఆర్‌సీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# దసరాలోపు యాదాద్రి ఫుల్ పవర్

- పూర్తి సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తికి చర్యలు చేపట్టాలి
- బొగ్గు కొరతతో ఉత్పత్తిపై ప్రభావం.. ప్రత్యామ్నాయాలపై దృష్టి
- మహానది కోల్‌ఫీల్డ్స్, కోల్ ఇండియా నుంచి బొగ్గు కొనుగోలుకు ఆదేశం
- కేంద్ర బొగ్గు గనుల శాఖతో తక్షణమే సంప్రదింపులు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి విద్యుత్ శాఖపై సమీక్ష



**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (సమయం న్యూస్):** యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని దసరాలోపు పూర్తి సామర్థ్యంతో పనిచేసేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించింది. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా యాదాద్రి కేంద్రంలో ఉత్పత్తిని గరిష్ఠ స్థాయికి తీసుకెళ్లాలని స్పష్టం చేసింది. ఇందుకు అవసరమైన బొగ్గు సరఫరాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలపైనా దృష్టి సారించాలని సూచించింది. ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యుత్ శాఖపై సమీక్ష నిర్వహించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం పూర్తి సామర్థ్యంతో పనిచేయకపోవడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జీ-9 గ్రేడ్ బొగ్గు లభ్యత, ప్రస్తుతం జరుగుతున్న బొగ్గు సరఫరా, దానివల్ల రాష్ట్రంపై పడుతున్న అదనపు ఆర్థిక భారం, సింగరేణికి సంబంధించిన బొగ్గు బ్లాకుల పరిస్థితిపై ప్రధానంగా చర్చించారు. యాదాద్రి విద్యుత్ కేంద్రానికి అవసరమైన నాణ్యమైన బొగ్గును నిరంతరాయంగా సమకూర్చడంపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. బొగ్గు లభ్యతలో ఎదురవుతున్న సమస్యలు, రవాణా వ్యయం, సరఫరా కారణంగా రాష్ట్రంపై పడుతున్న అదనపు ఆర్థిక భారాన్ని అధికారులు వివరించారు. విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన బొగ్గు కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్ర భవిష్యత్ విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని మహానది కోల్‌ఫీల్డ్స్, కోల్ ఇండియా నుంచి అవసరమైన బొగ్గు కొనుగోలుకు వెంటనే చర్యలు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించిన అనుమతులు, కేటాయింపులు, సరఫరా అంశాలపై కేంద్ర బొగ్గు గనుల శాఖతో తక్షణమే సంప్రదింపులు జరపాలని సూచించారు. సింగరేణి నుంచి అందుబాటులో ఉన్న బొగ్గు, ఇతర సంస్థల నుంచి సమకూర్చుకునే అవకాశాలను సమగ్రంగా పరిశీలించి యాదాద్రి విద్యుత్ కేంద్రానికి నిరంతరాయంగా బొగ్గు అందేలా కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం పూర్తి సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి చేసేలా దసరాలోపు అన్ని చర్యలు పూర్తి చేయాలని అధికారులకు గడువు విధించారు. బొగ్గు సరఫరా నుంచి విద్యుత్ ఉత్పత్తి వరకు ఎదురవుతున్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించి అన్ని యూనిట్లు పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలని ఆదేశించారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఉత్పత్తి సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, అవసరమైన బొగ్గు నిల్వలు ఉండేలా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# రైతు కన్నీటిలో ఓట్లు వెతకడమా?

**కరవుపై బీఆర్ఎస్ నీచ రాజకీయం**

**నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ ఆగ్రహం**

**నీటి కోసం కర్ణాటక సీఎంతో మంతనాలు.. సానుకూల స్పందన**

**పంటలను కాపాడతాం.. వేసవిలో నీటి ఎద్దడి రానివ్వం**

**నేరేడుచర్లలో రూ.26.93 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం**

**నేరేడుచర్ల, సెప్టెంబర్ 23 (సమయం న్యూస్) :** ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న వేళ రైతులకు భరోసా కల్పించాల్సిన ప్రధాన ప్రతిపక్షం కరవు రావాలని, పంటలు ఎండిపోవాలని కోరుకుంటూ పైశాచికానందం పొందేందుకు ప్రయత్నిస్తోందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి బీఆర్ఎస్ పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రకృతి కారణంగా ఏర్పడిన వర్షపాత లోటును కూడా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంగా చిత్రీకరిస్తూ ఆ పార్టీ నేతలు చేస్తున్న దుష్ప్రచారాన్ని దుయ్యబట్టారు. రైతుల కష్టాన్ని రాజకీయ పెట్టుబడిగా మార్చుకోవడం బాధ్యతాయుతమైన ప్రతిపక్ష లక్షణం కాదని మండిపడ్డారు. నేరేడుచర్ల మండలం మేడారం గ్రామంలో రూ.26.40 కోట్లతో నిర్మించిన నేరేడుచర్ల-దూపాడు డబుల్ రోడ్డును మంత్రి ఉత్తమ్ బుధవారం ప్రారంభించారు. రూ.20 లక్షలతో నిర్మించిన జానల్‌దిన్నె గ్రామ పంచాయతీ భవనం, రూ.33 లక్షలతో నిర్మించిన నేరేడుచర్ల గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించారు. మొత్తం రూ.26.93 కోట్ల అభివృద్ధి పనులను ప్రజలకు అంకితం చేశారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ ఎల్‌నినో అనేది ప్రపంచవ్యాప్తంగా వాతావరణాన్ని ప్రభావితం చేసే శాస్త్రీయ పరిణామం.. భారత రుతుపవనాలపైనా దాని ప్రభావం పడుతుంది.. ఈసారి వర్షపాతం దాదాపు 40 శాతం తగ్గింది.. ఈ వాస్తవాన్ని దాచిపెట్టి ప్రభుత్వంపై విషప్రచారం చేయడం బీఆర్ఎస్ రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనం అని విమర్శించారు. పొలంలో పంట ఎండిపోతే ప్రభుత్వానికి బాధ కలుగుతుంది.. బీఆర్ఎస్‌కు మాత్రం రాజకీయ అవకాశం కనిపిస్తోంది. రైతు కన్నీటిలో ఓట్లు వెతకడం కంటే నీచమైన రాజకీయం మరొకటి ఉండదు అంటూ విరుచుకుపడ్డారు. అందుబాటులో ఉన్న ప్రతి నీటి చుక్కనూ కాపాడి ప్రజల అవసరాలకు వినియోగించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. పంటలను కాపాడడం, రాబోయే వేసవిలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా చూసేందుకు ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలతో పనిచేస్తోందన్నారు. సమస్య వచ్చినప్పుడు పరిష్కారాన్ని వెతికేది కాంగ్రెస్ ప్రభుత్వం.. సమస్య మరింత పెరగాలని కోరుకునేది బీఆర్ఎస్.. తాము రైతు పంటను కాపాడేందుకు నీళ్ల కోసం రాష్ట్రాల తలుపులు తడుతున్నాం అని చెప్పారు. జూరాల ఆయకట్టు కింద పంటలను కాపాడేందుకు కర్ణాటక నుంచి నీటిని విడుదల చేయించే అంశంపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్‌తో మంతనాలు జరిపినట్లు ఉత్తమ్ వెల్లడించారు.



తనకున్న వ్యక్తిగత స్నేహాన్ని రాష్ట్ర రైతుల ప్రయోజనాల కోసం వినియోగించానని చెప్పారు. రాష్ట్ర విజ్ఞప్తికి డీకే సానుకూలంగా స్పందించారని, నీటి లభ్యతను పరిశీలించి సహకరించేందుకు హామీ ఇచ్చారని వివరించారు. 'మేం కర్ణాటకతో మాట్లాడి నీళ్లు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం.. బీఆర్ఎస్ నేతలు మాత్రం రైతుల్లో భయం సృష్టిస్తున్నారు.. మాకు రాజకీయాల కంటే పంటలు ముఖ్యం.. ప్రచారం కంటే ప్రజల ప్రాణాలు ముఖ్యం' అని మంత్రి స్పష్టం చేశారు. ప్రకృతిని శాసించలేము.. కానీ ప్రజలను కాపాడే బాధ్యత నుంచి ఒక్క అడుగు కూడా వెనక్కి వెళ్లం' అని ప్రకటించారు. ప్రజల అవసరాలకనుగుణంగా మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంతో తనకు ఉన్నది రాజకీయ సంబంధమే కాదు.. ప్రజలతో పెనవేసుకున్న ఆత్మీయ అనుబంధం.. మీ శ్రమ, ప్రేమ, ఆదరాభిమానాలతోనే ఆరుసార్లు శాసనసభకు, ఒకసారి లోక్‌సభకు ఎన్నికయ్యాను.. మీ రుణాన్ని అభివృద్ధితోనే తీర్చుకుంటా' అని చెప్పారు. పార్టీకి కార్యకర్తలు, నాయకులే వెన్నెముక అని మంత్రి అన్నారు. వారి కృషి, ప్రజల విశ్వాసంతోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. కోదాడ మెగా జాబ్ మేళా విజయవంతం కావడం ఈ ప్రాంత యువతపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని చెప్పారు. రోడ్లు, భవనాలు నిర్మించడం అభివృద్ధిలో ఒక భాగం.. కానీ ఒక యువకుడికి ఉద్యోగం వచ్చి అతని కుటుంబంలో వెలుగు నిండితే అంతకంటే గొప్ప సంతృప్తి మరొకటి ఉండదు.. కోదాడ మెగా జాబ్ మేళా విజయం ప్రజల ప్రభుత్వం ఏ విధంగా పనిచేస్తుందో నిరూపించింది అని ఉత్తమ్ అన్నారు. ప్రజా సంక్షేమం, రైతుల రక్షణ, యువతకు ఉపాధి, గ్రామాల సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. బీఆర్ఎస్ అవాస్తవ ప్రచారాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# ఉద్యోగులకు ఊరట

- రెండు డీఏల చెల్లింపునకు ప్రభుత్వం అంగీకారం
- త్వరలోనే పీఆర్‌సీ నివేదిక.. సీపీఎస్ రద్దుపై అధ్యయన కమిటీ ఏర్పాటు
- ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి




**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (సమయం న్యూస్):** రాష్ట్రంలోని సర్కారు ఉద్యోగులకు రెండు కరువు భత్యాలు (డీఏ) మంజూరు చేసేందుకు ప్రభుత్వం సానుకూలంగా అంగీకారం తెలిపింది. సచివాలయంలో బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు జరిపిన చర్చల అనంతరం ఈ కీలక నిర్ణయం వెలువడింది. ఈ సమావేశంలో ఉద్యోగుల పెండింగ్ డీఏలు, పీఆర్‌సీ, సీపీఎస్ రద్దు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశం ముగిసిన అనంతరం ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తమ సంఘం తరఫున మూడు డీఏలు విడుదల చేయాలని ప్రతిపాదించగా, ప్రభుత్వం రెండు డీఏల చెల్లింపునకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని వెల్లడించారు. ఇందులో 3.46 శాతంతో మొదటి డీఏను, 2.74 శాతంతో రెండో డీఏను ఇచ్చేందుకు అంగీకరించారని వివరించారు. ఇక మిగిలిన మూడో డీఏను రాబోయే 3 నుంచి 4నెలల వ్యవధిలో విడుదల చేస్తామని ప్రభుత్వం భరోసా ఇచ్చినట్లు తెలిపారు.

### ఈ నెలాఖరు నాటికి పీఆర్‌సీ నివేదిక

ఈ నెలాఖరు నాటికి పీఆర్‌సీ కమిషన్ నివేదిక ప్రభుత్వానికి అందే అవకాశం ఉందని సీఎస్ సంజయ్ జాజు తమకు తెలియజేశారని జేఏసీ నాయకులు వెల్లడించారు. నివేదిక అందిన వెంటనే తగు చర్యలు తీసుకుంటామని సీఎస్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. పీఆర్‌సీ కమిషన్ గడువును మళ్లీ పొడిగించకుండా నిర్దేశిత సమయంలోనే నివేదిక తీసుకునేలా చూడాలని ఉద్యోగ సంఘాలు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశాయి.

### సీపీఎస్ రద్దు, ఓపీఎస్ పునరుద్ధరణపై కమిటీ

కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే అంశంపై అధ్యయనం చేసేందుకు ఉద్యోగ సంఘాల నాయకులు మరియు ఉన్నతాధికారులతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ కమిటీ వివిధ రాష్ట్రాల్లో పర్యటించి అక్కడి పెన్షన్ విధానాలను అధ్యయనం చేసిన అనంతరం ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పిస్తుందని తెలిపారు. డీఏలు, పీఆర్‌సీ, సీపీఎస్ అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం పట్ల ఉద్యోగ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.



# డ్రగ్స్‌పై పోరాటం ఇంటి నుంచే ప్రారంభం కావాలి

- తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా
- ప్రభుత్వం, పోలీసులకే బాధ్యత పరిమితం కాదు..
- సమాజమంతా కలిసి ఉద్యమించాలి
- విద్యార్థులతో యాంటీ డ్రగ్ ప్రతిజ్ఞ, విద్యాసంస్థల ప్రవేశాల్లో డిక్లరేషన్ తప్పనిసరి
- వ్యసన బాధితులకు కౌన్సెలింగ్, పునరావాసం కల్పించి ప్రజా ఉద్యమంగా మార్చాలి



**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (సమయం న్యూస్):** డ్రగ్స్ మహమ్మారి నుంచి యువతను, విద్యార్థులను కాపాడటం కేవలం ప్రభుత్వం, పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి కుటుంబం, విద్యాసంస్థ, సమాజం కలిసికట్టుగా చేపట్టి నడిపించాల్సిన సామాజిక ఉద్యమమని తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా జరిగే పోరాటం ప్రతి ఇంటా ప్రారంభమై, విద్యాసంస్థలలో బలపడి, యువత భాగస్వామ్యంతో ప్రజా ఉద్యమంగా రూపాంతరం చెందాలని ఆకాంక్షించారు. గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి 'నశా ముక్త్ భారత్ అభియాన్'ను రాష్ట్రంలో విస్తృతంగా తీసుకెళ్లేందుకు ఆయన హైదరాబాద్‌తో పాటు నిజామాబాద్, హనుమకొండ, వరంగల్, ఆసిఫాబాద్ జిల్లాల్లో పర్యటించి విద్యార్థులు, యువతలో ప్రత్యేక అవగాహన కల్పించారు. ప్రతి పాఠశాల, కళాశాలలో విద్యార్థులతో యాంటీ డ్రగ్ ప్రతిజ్ఞ చేయించడంతో పాటు, విద్యాసంస్థలలో కొత్తగా చేరే సమయంలోనే మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామనే ముందస్తు డిక్లరేషన్ తీసుకోవాలని స్పష్టమైన సూచనలు చేశారు.

### 'నశా ముక్త్ యువ' కార్యక్రమాలు మిషన్ మోడ్‌లో అమలు

రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల ఉపకులపతులు (విసిలు)తో నిర్వహించిన సమావేశంలో గవర్నర్ మాట్లాడుతూ.. 'నశా ముక్త్ యువ' కార్యక్రమాన్ని మిషన్ మోడ్‌లో అమలు చేయాలని స్పష్టం చేశారు. విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఎన్సీసీ క్యాడెట్లు, అధ్యాపకులు 'మై భారత్' పోర్టల్ ద్వారా యాంటీ డ్రగ్ ప్రతిజ్ఞలో భాగస్వాములు కావాలని కోరారు. డ్రగ్స్ వ్యసనానికి గురైన వారిని కేవలం నేరస్థులుగా పరిగణించకుండా, వారికి తగిన కౌన్సెలింగ్, వైద్య సహాయం, పునరావాసం కల్పించి సాధారణ జీవితంలోకి తీసుకురావాలని సూచించారు. యువత తమ అపారమైన శక్తిసామర్థ్యాలను చదువు, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి, నూతన ఆవిష్కరణల వైపు మళ్లించి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని గవర్నర్ శివప్రతాప్ శుక్లా హితవు పలికారు.

# కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయింది

- కాంగ్రెస్ పాలనలో విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- నాసిరకం బొగ్గుతో 2,900 కోట్ల నష్టం..
- 80ల నాటి విద్యుత్ కష్టాలు పునరావృతం
- థర్మల్ ప్లాంట్ల పరిశీలనకు బీఆర్ఎస్ తరఫున ఆరు ప్రత్యేక బృందాలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (సమయం న్యూస్):** రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభం నెలకొనడానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యం, మిస్ మేనేజ్‌మెంట్ మరియు సింగరేణి–జెన్‌కోల మధ్య ఆర్థిక వ్యవహారాల గందరగోళమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న సమయంలో బొగ్గు కొరతతో థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి పడిపోతోందని, మరోవైపు జల విద్యుత్ కేంద్రాలు కూడా నీటి లభ్యత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని విమర్శించారు. ఈ పరిస్థితులపై వాస్తవాలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు ఆరు బీఆర్ఎస్ బృందాలు గురువారం థర్మల్ పవర్ ప్లాంట్లు, సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని సందర్శించనున్నాయని తెలంగాణ భవన్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గత బీఆర్ఎస్ హయాంలో పదేళ్ల కాలంలో స్థాపిత విద్యుత్ సామర్థ్యాన్ని 7,778 మెగావాట్ల నుంచి 19,472 మెగావాట్లకు పెంచామని, వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందించామని కేటీఆర్ గుర్తు చేశారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో రైతులకు ఆరు గంటలకు మించి ఉచిత కరెంట్ అందడం లేదని, 'కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయింది' అన్న చందంగా తెలంగాణలో 1980ల నాటి పరిస్థితులు పునరావృతమవుతున్నాయని ధ్వజమెత్తారు. 4,000 మెగావాట్ల సామర్థ్యం ఉన్న యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో కేవలం 400 మెగావాట్లు, జైపూర్ సింగరేణి ప్లాంట్‌లో 1,200 మెగావాట్లకు గాను 544 మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి అవుతోందని తెలిపారు.

### జెన్‌కోకు నాసిరకం బొగ్గు సరఫరా.. రూ.2,900 కోట్ల నష్టం

జెన్‌కోకు నాణ్యమైన బొగ్గు అందించాల్సిన సింగరేణి సంస్థ తక్కువ నాణ్యత కలిగిన జీ–13, జీ–14 గ్రేడ్ బొగ్గును సరఫరా చేయడం వల్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం తగ్గి రూ.2,900 కోట్ల ప్రజాధనం నష్టపోయిందని కేటీఆర్ ఆరోపించారు. ఇది 'ఎల్‌నినో కాదని.. ఎల్ కాంగో ప్రభావమని' ఎద్దేవా చేశారు. సింగరేణి నుంచి 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని, రూ.1,600 కోట్ల మేర అక్రమాలు జరిగాయని పునరుద్ఘాటించారు. అలాగే సింగరేణికి ప్రభుత్వం నుంచి రూ.52 వేల కోట్ల బకాయిలు రావాల్సి ఉండటంతో సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు.

### రంగంలోకి ఆరు బీఆర్ఎస్ పరిశీలన బృందాలు:

రాష్ట్రంలోని థర్మల్ ప్లాంట్ల పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించేందుకు బీఆర్ఎస్ తరఫున ఆరు ప్రత్యేక కమిటీలను వేస్తున్నట్లు కేటీఆర్ ప్రకటించారు. యాదాద్రి ప్లాంట్‌ను జగదీశ్‌రెడ్డి నేతృత్వంలోని బృందం, కొత్తగూడెంను వద్దిరాజు రవిచంద్ర, తాతా మధు బృందం, భద్రాద్రి ప్లాంట్‌ను పువ్వాడ అజయ్ బృందం, కాకతీయ ప్లాంట్‌ను పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు బృందం, జైపూర్ సింగరేణి ప్లాంట్‌ను జోగు రామన్న, బాల్క సుమన్ బృందం మరియు హైదరాబాద్ సింగరేణి సీసిఓను కొప్పుల ఈశ్వర్ బృందం సందర్శించి నివేదిక ఇవ్వనున్నాయి. ఈ నివేదికల ఆధారంగా తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.



# ఎన్నికలకు ఇప్పటి నుంచే రెడీ కావాలి

- క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలి
- పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి
- నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకెళ్లాలి
- ప్రజల్లో ఉంటూ పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా తీసుకెళ్లాలి
- బీజేపీ శ్రేణులకు రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు దిశానిర్దేశం



**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (సమయం న్యూస్):** రానున్న ఎన్నికలకు పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే పూర్తిస్థాయిలో సమాయత్తం కావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు పిలుపునిచ్చారు. ఎన్నికలు వచ్చినప్పుడు హడావుడి చేయడం కాకుండా ముందుగానే క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసుకోవాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల్లో పార్టీకి మరింత ఆదరణ పెరిగేలా కార్యాచరణ చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం జరిగిన ఎన్నికల సన్నాహక సమావేశానికి రామచందర్‌రావు అధ్యక్షత వహించారు. రానున్న పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికలతోపాటు ఇతర ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ అనుసరించాల్సిన కార్యాచరణపై ముఖ్య నేతలతో చర్చించారు. పార్టీ బలం క్షేత్రస్థాయిలోనే ఉంటుందని, అందుకే ప్రతి నాయకుడు తనకు అప్పగించిన ప్రాంతంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని రామచందర్‌రావు సూచించారు. పట్టభద్ర ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో అర్హులైన పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించడంతోపాటు వారితో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని చెప్పారు. పార్టీ నాయకత్వం నుంచి క్షేత్రస్థాయి కార్యకర్త వరకు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని సూచించారు. ఎక్కడ బలహీనతలు ఉన్నాయో గుర్తించి వాటిని అధిగమించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని చెప్పారు. ఎన్నికలకు సిద్ధమవడం అంటే కేవలం సమావేశాలు నిర్వహించడం కాదని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందిస్తూ వారి మధ్య ఉండాలని రామచందర్‌రావు పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై పోరాటాలతోపాటు సేవా కార్యక్రమాలను కొనసాగించాలని సూచించారు. రాజకీయాలు ఎన్నికలు, ఓట్లకే పరిమితం కాకుండా ప్రజాసేవకు వేదిక కావాలన్నారు. నాగోల్‌లో భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో పాల్గొన్న రామచందర్‌రావు స్వయంగా రక్తదానం చేశారు. ఇతరుల ప్రాణాలను కాపాడే రక్తదానం వంటి సేవా కార్యక్రమాల్లో యువత ముందుండాలని పిలుపునిచ్చారు.

### సమన్వయమే కీలకం

రాబోయే ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం కీలకమని రామచందర్‌రావు పేర్కొన్నారు. వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి పార్టీ లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలని సూచించారు. గత నెలలో జరిగిన పార్టీ సమీక్షలోనూ సంస్థాగత బలోపేతం, నాయకుల మధ్య సమన్వయానికి ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర నాయకత్వానికి సూచనలు అందాయి. ఎన్నికల వరకు వేచి చూడకుండా ఇప్పటి నుంచే కార్యాచరణను అమలు చేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.



# మా భూముల హద్దులు నిర్ధారించాలి

### కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు రైతుల వినతిపత్రం

### కలకలం రేపుతోన్న ఎర్రవల్లి భూ సర్వే వివాదం

**మర్కుక్, సెప్టెంబర్ 23 (సమయం న్యూస్) :** సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలంలో భూ వివాదం కలకలం రేపుతోంది. అధికారులు ఇచ్చిన పట్టాదార్ పాస్ పుస్తకాల ప్రకారం కాకుండా వేరే సర్వే నంబర్ల పేరుతో వచ్చి భూములు కొలుస్తున్నారంటూ శివారు వెంకటాపుర్ గ్రామానికి చెందిన రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాస్ పుస్తకాలు ఉన్న తమ భూములకు హద్దులు నిర్ధారించి న్యాయం చేయాలని కోరుతూ ఎంఆర్వో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం, రికార్డుల వ్యత్యాసం వల్ల దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న తమ భూములను కోల్పోవాల్సి వస్తోందని ఆరోపించారు. శివారు వెంకటాపుర్ గ్రామానికి చెందిన సర్వే నంబర్లు 41,85,88,77,100 లలో తమకు అధికారికంగా ధరణి పాస్ పుస్తకాలు, అలాగే పూర్వపు ఇందిరమ్మ పట్టాలు ఉన్నాయని రైతులు స్పష్టం చేశారు. కానీ అధికారులు ఎర్రవల్లి శివారుకు చెందిన సర్వే నంబర్ 325తో తమ భూములకు సంబంధం ముడిపెట్టి తమను వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారని వారు వాపోతున్నారు. ముందస్తు నోటీసులు లేకుండా వచ్చి సర్వే నిర్వహించడాన్ని సర్వే అధికారులను అడ్డుకుని నిరసన తెలిపారు. 'మాకు అధికారులే 41 సర్వే నంబర్ల పట్టా పాస్ పుస్తకాలు ఇచ్చారు.. మేము 41 లోనే వ్యవసాయం చేసుకుంటున్నాం.. ఇప్పుడు వచ్చి మమ్మల్ని వెళ్లగొట్టి కొలుస్తామంటే ఎట్లా.. సిఎం రేవంత్ రెడ్డి స్పందించి రికార్డుల ప్రకారం సర్వే చేయించి మాకు న్యాయం చేయాలని వేడుకుంటున్నాం' అన్నారు. సర్వే నంబర్లు 41, 85, 88, 77, 100 లను తీసుకెళ్లి 325 సర్వే నంబర్‌లో కలిపేశారు. గుర్రాల సూరయ్య, దర్శనాల చంద్రయ్య, కుమార్‌లకు ధరణి పాస్ పుస్తకాలు ఉన్నా కూడా మాకు నోటీసులు ఇవ్వకుండా కొలవడానికి వచ్చారన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శివారు వెంకటపూర్ రైతులు అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఎమ్మార్వో కార్యాలయంలో ఎమ్మార్వో సరితకు వినతి పత్రం అందజేశారు. వెంటనే చర్యలు తీసుకుని మా శివారు హద్దులు నిర్ధారించి మాకు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

# ప్రశాంత వాతావరణంలో నిమజ్జనాలు జరగాలి

### భారీ బందోబస్తు.. సమన్వయంతో ఏర్పాట్లు

### డీజేలు, బాణసంచాకు దూరంగా ఉండాలి

### ఉత్సవ కమిటీలకు సూచించిన డీజీపీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (సమయం న్యూస్):** గణేష్ నిమజ్జనాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేసినట్లు డీజీపీ సి.వి.ఆనంద్ తెలిపారు. ఖైరతాబాద్ మహాగణపతిని బుధవారం దర్శించుకున్న ఆయన రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, గణనాథుడి ఆశీస్సులు అందరికీ లభించాలని ఆకాంక్షించారు. సెంట్రల్ జోన్ డీసీపీగా పనిచేసినప్పటి నుంచి ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలతో తనకు 13 ఏళ్ల అనుబంధం ఉందని డీజీపీ గుర్తు చేశారు. నాడు సుదర్శన్, ఇప్పుడు వారి కొడుకులు సందీప్, రాజ్ కుమార్, కూతురు వీణ, మహేష్ యాదవ్, ఇతర సభ్యులు శాంతియుతంగా నిమజ్జనాలు చెయ్యడానికి చాలా సహకరిస్తారని తెలిపారు. ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులతోపాటు పోలీసు, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పది రోజుల గణేష్ ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయని డీజీపీ తెలిపారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో నిమజ్జనాలు జరుగుతున్నాయని, రేపు, ఎల్లుండి భారీ సంఖ్యలో నిమజ్జనాలు జరిగే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లోనూ సీపీలు, ఎస్పీలు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో సుమారు 30 వేల మంది పోలీసులను బందోబస్తు కోసం మోహరించినట్లు వెల్లడించారు. నిమజ్జనాల కోసం జీహెచ్ఎంసీ, విద్యుత్, జలవనరులు, ఇతర ప్రభుత్వ శాఖలతో పోలీసుశాఖ సమన్వయంతో పనిచేస్తోందని తెలిపారు. హుస్సేన్‌సాగర్‌తో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిమజ్జన ఏర్పాట్లు పూర్తిచేశామని చెప్పారు. ట్యాంక్‌బండ్‌పై అవసరమైనచోట్ల క్రేన్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నిమజ్జన ఊరేగింపు మార్గాల్లో చోరీలు, మహిళల పట్ల వేధింపులు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు డీజీపీ తెలిపారు. షీ టీమ్స్, టాస్క్‌ఫోర్స్ బృందాలను రంగంలోకి దించామని, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని చెప్పారు. నిమజ్జన ఊరేగింపుల్లో డీజేలు, బాణసంచా వినియోగంపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలు అమల్లో ఉన్నాయని గుర్తుచేశారు. అధిక శబ్దాలతో ప్రజలు, ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఉత్సవ కమిటీలు డీజేలు, బాణసంచాకు దూరంగా ఉండాలని స్వచ్ఛందంగా నిర్ణయించుకోవడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించాలని డీజీపీ ఆనంద్ సూచించారు.



## సంపాదకీయం



# రాహుల్ వర్సెస్ అఖిలేశ్

## కూటమిలో మాటల పోరు!

**యూపీ ఎన్నికలకు ముందే సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ నేతల మధ్య భిన్న స్వరాలు**

**అఖిలేశ్ నాయకత్వాన్ని సమర్థించిన ఎంపీ ఇక్రా హసన్**

**రాహుల్ గాంధీ లేకుండా సాధ్యం కాదన్న కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్**

**2024లో కలిసి 43 లోక్‌సభ స్థానాలు గెలిచిన రెండు పార్టీలు**

**2027 అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల పంపకాలపై ఇంకా కుదరని ఒప్పందం**

**ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ కూటమిలో నాయకత్వంపై చర్చ మొదలైంది. రెండు పార్టీల అగ్రనేతలు కూటమిని కొనసాగించేందుకు సానుకూలంగా ఉన్నప్పటికీ, ఆయా పార్టీల ఎంపీలు చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయ చర్చకు దారితీశాయి. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీని ఎదుర్కోవడంలో అఖిలేశ్ యాదవ్ పాత్రను సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ఇక్రా హసన్ ప్రధానంగా ప్రస్తావించగా, కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ రాహుల్ గాంధీ ప్రాధాన్యాన్ని నొక్కిచెప్పారు. దీంతో 2027 ఎన్నికలకు ముందు కూటమిలో నాయకత్వం, సీట్ల పంపకాల అంశాలు మరోసారి తెరపైకి వచ్చాయి.**

### 'అఖిలేశ్ లేకుండా సాధ్యం కాదు'

ఉత్తరప్రదేశ్‌లో బీజేపీని ఎదుర్కోవడంలో సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ కీలకమని కైరానా ఎంపీ ఇక్రా హసన్ మంగళవారం వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఒంటరిగా పెద్దగా సాధించలేదని ఆమె అభిప్రాయపడ్డారు. అయితే రెండు పార్టీలు కలిసి పనిచేస్తే వాటి బలం పెరుగుతుందని కూడా పేర్కొన్నారు. ఆమె వ్యాఖ్యలు కూటమిలో సమాజ్‌వాదీ పార్టీ పాత్రపై చర్చకు దారితీశాయి.

### 'రాహుల్ పాత్రను విస్మరించలేరు'

ఇక్రా హసన్ వ్యాఖ్యలపై సహారన్‌పూర్ కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ స్పందించారు. దేశవ్యాప్తంగా ప్రతిపక్ష గొంతుకగా రాహుల్ గాంధీ వ్యవహరిస్తున్నారని, ఆయన కృషిని విస్మరించలేమని పేర్కొన్నారు. కాంగ్రెస్ లేకుండా ఉత్తరప్రదేశ్‌లో బీజేపీని ఎదుర్కోవడం సాధ్యం కాదని అభిప్రాయపడ్డారు. సీట్ల పంపకాలపై రెండు పార్టీలు త్వరగా నిర్ణయం తీసుకోవాలని మసూద్ ఇప్పటికే కోరారు. గతంలో సమాజ్‌వాదీ పార్టీలో పనిచేసిన ఆయన ప్రస్తుతం కాంగ్రెస్ తరఫున లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

### గత ఎన్నికల్లో కలిసి 43 స్థానాలు

2024 లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ కలిసి పోటీ చేశాయి. రాష్ట్రంలోని మొత్తం 80 స్థానాల్లో రెండు పార్టీలు కలిపి 43 స్థానాలను గెలుచుకున్నాయి. సమాజ్‌వాదీ పార్టీకి 37, కాంగ్రెస్‌కు ఆరు స్థానాలు దక్కాయి. అయోధ్య ఉన్న ఫైజాబాద్ లోక్‌సభ స్థానాన్ని కూడా సమాజ్‌వాదీ పార్టీ గెలుచుకుంది. ఈ ఫలితాల నేపథ్యంలో 2027 అసెంబ్లీ ఎన్నికల్లోనూ కూటమిని కొనసాగించే అంశంపై ఇరు పార్టీల అగ్రనేతలు సానుకూల ప్రకటనలు చేశారు.

### సీట్ల పంపకాలపై ఇంకా స్పష్టత లేదు

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీ ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలనే అంశంపై ఇప్పటివరకు తుది ఒప్పందం కుదరలేదు. కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ సీట్ల పంపకాలను త్వరగా ఖరారు చేయాలని కోరుతుండగా, కూటమికి సంబంధించిన నిర్ణయాలను అఖిలేశ్ యాదవ్, రాహుల్ గాంధీ తీసుకుంటారని సమాజ్‌వాదీ పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రెండు పార్టీల ఎంపీల పరస్పర వ్యాఖ్యలు ఎన్నికల సన్నాహాల్లో రాజకీయ చర్చకు కారణమయ్యాయి. అయితే అగ్రనేతల మధ్య కూటమి కొనసాగింపుపై విభేదాలు తలెత్తినట్లు ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు.

# ఎన్నికల సంఘంలో 'విభేదాల' దుమారం

- పది నెలల్లో 14 సార్లు ఇద్దరు కమిషనర్ల అభ్యంతరాలంటూ కథనం
- ఓటర్ల జాబితా, ఫారం-6 మార్పులు, సమాచార కేంద్రీకరణపై ప్రశ్నలు
- అవి అభిప్రాయాలు మాత్రమే.. తుది నిర్ణయాలపై విభేదాలు లేవన్న ఈసీ
- 'సర్' సహా నిర్ణయాలన్నీ ఏకగ్రీవమేనని స్పష్టీకరణ
- దుమారం రేపిన కథనం.. ఎన్నికల సంఘంపై విపక్షాల విమర్శలు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23 (సమయం న్యూస్):** కేంద్ర ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలు తలెత్తాయంటూ వెలువడిన మీడియా కథనం రాజకీయ దుమారం రేపింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌తో కలిసి పనిచేస్తున్న ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో ఎన్నికల సంఘం తీసుకున్న కొన్ని చర్యలపై అధికారికంగా అభ్యంతరాలు నమోదు చేసినట్లు 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' దర్యాప్తు కథనం వెల్లడించింది. అయితే ఎన్నికల సంఘం ఈ కథనంలో వచ్చిన 'విభేదాల' వాదనను తోసిపుచ్చింది. కమిషనర్లు వివిధ అంశాలపై అభిప్రాయాలు, పరిశీలనలు వ్యక్తం చేయడం సహజమని, ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణతో సహా తుది నిర్ణయాలన్నీ ముగ్గురు కమిషనర్ల ఏకాభిప్రాయంతోనే తీసుకున్నట్లు స్పష్టం చేసింది. సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, ఓటర్ల జాబితా సమాచార నిర్వహణ, ఎన్నికల సంఘం సాంకేతిక వ్యవస్థలకు సంబంధించిన చర్యలపై ప్రశ్నలు లేవనెత్తినట్లు దర్యాప్తు కథనం పేర్కొంది. కొన్ని నిర్ణయాలు తమకు తెలియకుండానే తీసుకున్నట్లు ఇద్దరు కమిషనర్లు అధికారిక రికార్డుల్లో పేర్కొన్నారని తెలిపింది. కొత్త ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే ఫారం-6లో మార్పులు చేయడంపైనా అభ్యంతరాలు వ్యక్తమైనట్లు కథనం వెల్లడించింది. నిబంధనల్లో అవసరమైన మార్పులు చేయకుండా చట్టబద్ధమైన దరఖాస్తు పత్రంలో మార్పులు చేయడాన్ని వివేక్ జోషి ప్రశ్నించారని, అనంతరం సంధు కూడా ఆ మార్పును 'అనధికారికం, చట్టవిరుద్ధం'గా పేర్కొంటూ తొలగించాలని రికార్డులో నమోదు చేసినట్లు తెలిపింది. ఓటర్ల జాబితా సమాచార నిర్వహణ క్రమంగా కేంద్రీకృతమవుతోందన్న ఆందోళనను కూడా ఇద్దరు కమిషనర్లు వ్యక్తం చేసినట్లు కథనం పేర్కొంది. చట్టబద్ధంగా ఓటర్ల జాబితాను నిర్వహించే క్షేత్రస్థాయి అధికారులకు పూర్తి స్థాయి ప్రవేశం ఉండాలని, ఇతరులకు ఓటర్ల సమాచారంలో మార్పులు చేసే అవకాశం ఉండకూడదని జోషి సూచించినట్లు తెలిపింది. రాష్ట్రస్థాయి ఎన్నికల అధికారులకు అవసరమైన పూర్తి ప్రవేశం లేదన్న అంశాన్ని సంధు కూడా ప్రస్తావించినట్లు పేర్కొంది. ఈ కథనం నేపథ్యంలో ఎన్నికల సంఘం వర్గాలు స్పందిస్తూ కమిషన్‌లో అధికారిక విభేదాలున్నాయన్న వాదనను ఖండించాయి. ఎన్నికల కమిషనర్లు వివిధ అంశాలపై తమ అభిప్రాయాలు, సూచనలు, పరిశీలనలు నమోదు చేయవచ్చని, వాటిని అధికారులు పరిశీలిస్తారని పేర్కొన్నాయి. అలాంటి పరిశీలనలను కమిషన్ తుది నిర్ణయాలపై అసమ్మతిగా పరిగణించరాదని స్పష్టం చేశాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి భాగస్వామ్యంతోనే నిర్ణయాలు తీసుకుంటున్నామని ఎన్నికల సంఘం తెలిపింది. దేశవ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన తుది నిర్ణయాలు కూడా ఏకగ్రీవంగానే తీసుకున్నట్లు పేర్కొంది. 2023 నాటి ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్లకు సంబంధించిన చట్టంలోని సెక్షన్ 18 ప్రకారం కమిషన్ కార్యకలాపాలను సాధ్యమైనంత వరకు ఏకగ్రీవంగా నిర్వహించాలి. ఏదైనా అంశంపై ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల మధ్య అభిప్రాయభేదం ఏర్పడితే మెజారిటీ అభిప్రాయం ప్రకారం నిర్ణయం తీసుకోవాలి. ఈ నిబంధనలను కూడా ఇద్దరు కమిషనర్లు తమ అంతర్గత నోట్లలో ప్రస్తావించినట్లు దర్యాప్తు కథనం తెలిపింది. ఈ కథనం వెలువడిన తర్వాత విపక్ష నేతలు ఎన్నికల సంఘం పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, శివసేన ఉద్ధవ్ వర్గం తదితర పార్టీల నేతలు ఈ వ్యవహారంపై వివరణ కోరారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై చర్య తీసుకోవాలంటూ కొందరు విపక్ష నేతలు డిమాండ్ చేశారు. మరోవైపు ఎన్నికల సంఘం మాత్రం అంతర్గతంగా వ్యక్తమయ్యే అభిప్రాయాలను తుది నిర్ణయాలతో ముడిపెట్టడం సరికాదని, కమిషన్ నిర్ణయాలు ఏకగ్రీవంగానే జరిగాయని స్పష్టం చేసింది.

# ఈసీపై కాంగ్రెస్ అగ్రనేతల ఘాటు దాడి

**అక్రమాలకు ఈసీ సహకరిస్తే అది తీవ్రమైన 'దేశద్రోహ చర్య': ప్రియాంక, రాహుల్ గాంధీ**

**ఓటు చోరీపై స్పందించిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23 (సమయం న్యూస్):** దేశంలో ఎన్నికల నిష్పాక్షికత మరియు పారదర్శకతపై రాజకీయ రచ్చ పీక్ స్టేజ్‌కి చేరింది. కేంద్ర ఎన్నికల సంఘంలో అంతర్గత అభ్యంతరాలు, విభేదాలు ఉన్నాయంటూ ఓ ప్రముఖ ఆంగ్ల దినపత్రిక ప్రచురించిన కథనం ఆధారంగా కాంగ్రెస్ అగ్రనేతలు ఎన్నికల సంఘం పనితీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. కేరళలోని మలప్పురం జిల్లా నిలంబూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా మాట్లాడుతూ.. ఎన్నికలు పారదర్శకంగా జరగకపోతే ప్రజాస్వామ్యానికే అర్థం ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో అక్రమాలు జరగడానికి ఎన్నికల సంఘం సహకరిస్తే, అది ప్రజాస్వామ్యంపై జరిగే తీవ్రమైన దాడి అని ఆమె పేర్కొన్నారు. "ముఖ్య ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు ఈ అక్రమాల గురించి తెలిసీ అనుమతిస్తుంటే, అది దేశంతో చేసే ద్రోహం.. తీవ్రమైన దేశద్రోహ చర్య క్రిందికే వస్తుంది" అని ప్రియాంక గాంధీ ఘాటుగా వ్యాఖ్యానించారు.

### 'ఓటు చోరీ' రాజ్యాంగంపై జరిగే దాడి:

ఈ వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. 'ఓటు చోరీ' అనేది భారత ప్రజలకు, రాజ్యాంగానికి వ్యతిరేకంగా జరిగే తీవ్ర నేరమని, ఇది స్పష్టంగా రాజ్యాంగంపై జరిగే దాడని మండిపడ్డారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' (ఙ) లో వీడియో పోస్ట్ చేస్తూ.. "ఎన్నికల సంఘం అధికారులు చేస్తున్న పనులు రాజ్యాంగ విరుద్ధం. భవిష్యత్తులో సమయం వచ్చినప్పుడు చట్టపరంగా ఎవరినీ వదిలిపెట్టేది లేదు.. బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయి" అని హెచ్చరించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలో మార్పులు, ఓటు చోరీ ప్రక్రియ భారత ప్రజాస్వామ్య పునాదులను దెబ్బతీస్తోందన్నారు. ఈ అక్రమ ప్రక్రియలో భాగస్వాములవుతున్న అధికారులు రాజ్యాంగ వ్యతిరేక పనులకు దూరంగా ఉండాలని, లేనిపక్షంలో భవిష్యత్తులో తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

# విదేశీ కొలువులకు 'స్కిల్ మ్యాపింగ్'

- భారత యువతకు ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగావకాశాలే లక్ష్యం
- దాదాపు 20 దేశాల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ
- సంరక్షణ, నిర్మాణ రంగాల్లో భారీగా మానవ వనరుల అవసరం
- భారత్ జనాభా ప్రయోజనాన్ని అవకాశంగా మలిచే దిశగా కేంద్రం

షాంఘై ప్రపంచ నైపుణ్యాల పోటీలో 63 విభాగాల్లో భారత్ పోటీ



**షాంఘై (చైనా), సెప్టెంబర్ 23 (సమయం న్యూస్):** భారత యువతకు విదేశాల్లో ఉపాధి అవకాశాలను మరింత విస్తరించే దిశగా కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ చర్యలు చేపట్టింది. ప్రపంచంలోని వివిధ దేశాల్లో ఉన్న ఉద్యోగ అవసరాలు, నైపుణ్య ప్రమాణాలకు అనుగుణంగా దేశీయ శిక్షణ విధానాలను అనుసంధానించే ప్రక్రియపై దృష్టి సారించింది. దాదాపు 20 దేశాల్లోని ఉద్యోగ ప్రమాణాలు, నైపుణ్య అవసరాలకు అనుగుణంగా భారత యువతకు శిక్షణ అందించే దిశగా కసరత్తు జరుగుతోందని మంత్రిత్వ శాఖ సీనియర్ ఆర్థిక సలహాదారు మనీషా సేన్ శర్మ వెల్లడించారు. ప్రపంచంలోని పలు దేశాల్లో వృద్ధుల జనాభా పెరుగుతుండటం, పనిచేసే వయసులోని మానవ వనరులు తగ్గుతుండటంతో నైపుణ్యం కలిగిన కార్మికులకు డిమాండ్ పెరుగుతోందని ఆమె పేర్కొన్నారు. ఈ పరిస్థితిని భారత యువతకు అంతర్జాతీయ ఉపాధి అవకాశంగా మార్చేందుకు ఆయా దేశాల ఉద్యోగ ప్రమాణాలకు అనుగుణంగా పాఠ్యాంశాలు, శిక్షణ విధానాలను రూపొందించడంపై దృష్టి పెట్టినట్లు తెలిపారు.

### 20 దేశాల అవసరాలకు తగ్గట్టుగా..

విదేశాల్లో ఏయే రంగాల్లో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి? ఆయా ఉద్యోగాలకు ఎలాంటి నైపుణ్యాలు అవసరం? అక్కడి పరిశ్రమలు ఎలాంటి ప్రమాణాలను కోరుతున్నాయి? వంటి అంశాలను గుర్తించి దేశీయ నైపుణ్య శిక్షణతో అనుసంధానించే ప్రయత్నాలు జరుగుతున్నాయని మనీషా సేన్ శర్మ వివరించారు. దాదాపు 20 దేశాలను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. దేశీయంగా శిక్షణ పొందిన యువత విదేశాలకు వెళ్లిన తర్వాత మళ్లీ ప్రత్యేకంగా శిక్షణ పొందాల్సిన అవసరం లేకుండా, ఆయా దేశాల ఉద్యోగ ప్రమాణాలకు సరిపోయే నైపుణ్యాలతో వారిని ముందుగానే సిద్ధం చేయడం ఈ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

### సంరక్షణ.. నిర్మాణ రంగాల్లో డిమాండ్

ప్రపంచవ్యాప్తంగా ముఖ్యంగా సంరక్షకులు, నిర్మాణ రంగ కార్మికులతోపాటు నైపుణ్యం, పాక్షిక నైపుణ్యం అవసరమైన అనేక ఉద్యోగాల్లో మానవ వనరుల కొరత ఉందని ఆమె పేర్కొన్నారు. యూఏఈ సహా పలు దేశాల్లో భారతీయ నైపుణ్య కార్మికులకు అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అనేక అభివృద్ధి చెందిన దేశాలు వృద్ధాప్య జనాభా సమస్యను ఎదుర్కొంటున్న సమయంలో యువ జనాభా అధికంగా ఉన్న భారత్‌కు ఇది కీలక అవకాశంగా మారుతుందని పేర్కొన్నారు. దేశంలోని యువతకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నైపుణ్యాలను అందించగలిగితే రాబోయే సంవత్సరాల్లో ప్రపంచ ఉద్యోగ విపణిలో భారత్ కీలక మానవ వనరుల కేంద్రంగా ఎదిగే అవకాశముందని తెలిపారు.

### షాంఘైలో నైపుణ్యాల సమరం

మరోవైపు చైనాలోని షాంఘై వేదికగా 48వ ప్రపంచ నైపుణ్యాల పోటీ ప్రారంభమైంది. సెప్టెంబర్ 22 నుంచి 27 వరకు జరిగే ఈ అంతర్జాతీయ పోటీల్లో భారత్ తన చరిత్రలోనే అతిపెద్ద బృందాన్ని బరిలోకి దించింది. 70 మంది భారత యువ ప్రతిభావంతులు మొత్తం 64 నైపుణ్య విభాగాల్లో 63 విభాగాల్లో పోటీపడుతున్నారు. ఈసారి భారత్ తొలిసారిగా 11 కొత్త నైపుణ్య విభాగాల్లోనూ పోటీపడుతోంది. దంత కృత్రిమ అవయవాల తయారీ, డిజిటల్ ఇంటరాక్టివ్ మీడియా డిజైన్, ఇంటెలిజెంట్ సెక్యూరిటీ టెక్నాలజీ, ల్యాండ్‌స్కేప్ గార్డెనింగ్, ఆప్టోఎలక్ట్రానిక్ టెక్నాలజీ, రిటైల్ సేల్స్, మానవరహిత వైమానిక వ్యవస్థలు, ఇండస్ట్రియల్ మెకానిక్స్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, భారీ వాహన సాంకేతికత, విమానాల నిర్వహణ విభాగాల్లో భారత యువత తొలిసారి తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తోంది. షాంఘై పోటీల్లో మొత్తం 68 దేశాలు, ప్రాంతాల నుంచి 1,385 మంది యువ నిపుణులు 64 నైపుణ్య విభాగాల్లో తలపడుతున్నారు. సెప్టెంబర్ 22న ప్రారంభోత్సవం జరగగా, 23 నుంచి 26 వరకు ప్రధాన పోటీలు కొనసాగి 27న ముగింపు కార్యక్రమం జరగనుంది. దేశీయ పరిశ్రమల అవసరాలతోపాటు అంతర్జాతీయ ఉద్యోగ విపణి ప్రమాణాలకు అనుగుణంగా యువతను తీర్చిదిద్దడం ద్వారా భారత్‌ను ప్రపంచ నైపుణ్య మానవ వనరుల కేంద్రంగా మార్చే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ పేర్కొంటోంది.

# పట్టు దల ఉంటే ఏదైనా సాధించవచ్చు

**శాసన సభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్**



**వికారాబాద్, సెప్టెంబర్,23(సమయం న్యూస్)**
వికారాబాద్:శారీరక లోపం ఎదుగు దలకు అడ్డు కాదని, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని శాసన సభ సభాపతి గడ్డ ం ప్రసాద్ కుమార్ అన్నారు. బుధవారం వికారాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వికలత్వ నిర్ధారణ పరీక్ష కేంద్రమును శాసన సభ సభాపతి గడ్డ ం ప్రసాద్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సభాపతి మాట్లాడుతూ.. .సదరం శిభిరానికి వచ్చే వారికి మౌలిక వసతులు కల్పించాలన్నారు. సెర్ప్ ద్వారా 10 లక్షల రూపాయల నిధులతో ప్రత్యేకంగా ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో సదరం శిబిరం ఏర్పాటు చేయడం మంచి పరిణామమన్నారు. వికలత్వ నిర్ధారణ పరీక్షకు వచ్చే వారికి ఈ శిబిరం ఎంతగానో దోహదపడుతుందని ఆయన అన్నారు.ప్రతి అర్హుడైన దివ్యాంగునికి సదరం సర్టిఫికేట్ అందేలా చూడాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడంతో పాటు మందులను ఎప్పటికీ అందుబాటులో ఉండే విధంగా తగు జాగ్రత్తలు తీసుకో వాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో కావాల్సిన అవసరాలు, సిబ్బంది వివరాలను సభాపతి అధికారులను అడిగి తెలుసు కున్నారు.సదరం శిబిరం ప్రారంభోత్సవం లోజిల్లా కలెక్టర్ దిపక్ తివారి, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# మైనర్లు వాహనాలు నడిపితే చట్ట ప్రకారం కఠిన చర్యలు

**కోస్గి ఎస్సై చంద్రశేఖర్**




**కోస్గి మండలం, సెప్టెంబర్,23(సమయం న్యూస్)**
కోస్గి: మైనర్లు వాహనాలు నడపడం, ఒకే వాహనంపై పరిమితికి మించి ప్రయాణించడం,ప్రమాదకరంగా డ్రైవింగ్ చేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని నారాయణపేట జిల్లా కోస్గి ఎస్సై చంద్రశేఖర్ హెచ్చరించారు.కోస్గి టౌన్ పరిధిలోని సయ్యద్ పాడ్ దర్గా వద్ద సజాఖాన్‌పేట రోడ్డులో ఒకే స్కూటీపై నలుగురు మైనర్ స్కూల్ విద్యార్థులు ప్రయాణిస్తూ ప్రమాద కరంగా డ్రైవింగ్ చేస్తుండగా కోస్గి పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విద్యార్థులు ప్రమాదకరంగా వాహనం నడపడంతో పాటు ఒకే స్కూటీపై నలుగురు ప్రయాణించడం ద్వారా తమ ప్రాణాలతో పాటు ఇతర వాహనదారులు, పాదచారుల ప్రాణాలకు కూడా ముప్పు కలిగించే పరిస్థితి ఏర్పడింది.

పోలీసులు వెంటనే స్కూటీని పోలీస్ స్టేషన్‌కు తరలించి, విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అలాగే సంబంధిత స్కూల్ యాజమాన్యంతో మాట్లాడి, విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, మైనర్లు వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ కౌన్సెలింగ్ నిర్వహిం చనున్నారు.ఈ సందర్భంగా ఎస్సై చంద్రశేఖర్ మాట్లాడుతూ... మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వడం, మైనర్లు స్వయంగా వాహనాలు నడపడం చట్టపరంగా తీవ్రమైన నిబంధనల ఉల్లంఘనకు దారితీస్తుందని తెలిపారు. ముఖ్యంగా స్కూల్ విద్యార్థులు సరైన డ్రైవింగ్ అనుభవం, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు.తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా బాధ్యతగా వ్యవహ రించాలని, స్కూల్ యాజమాన్యాలు కూడా విద్యార్థులు వాహనాలతో పాఠశాలకు రావడం లేదా ప్రమాదకరంగా వాహనాలు నడపకుండా అవగాహన కల్పించాలని సూచించారు.ఇకపై ఇదే తరహా ఘటనలు పునరావృతమైతే కేవలం విద్యార్థులకు కౌన్సెలింగ్‌తో సరిపెట్టకుండా, నిబంధనల ప్రకారం తల్లిదండ్రులు, సంబంధిత బాధ్యత వహించాల్సిన స్కూల్ యాజమాన్యంపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుం టామని ఎస్సై చంద్రశేఖర్ స్పష్టం చేశారు.

# డా.అనితా రెడ్డికి శ్రీగణేష్ ఎక్సలెన్స్ అవార్డు

- **పర్యావరణ పరిరక్షణకు విశేష సేవలు..**
- **ప్రకృతిని కాపాడే ప్రతి అడుగూ.. భావితరాలకు ఓ కానుక**
- **సంస్థ ఫౌండర్ చైర్మన్ అడ్వకేట్ డాక్టర్ చక్రవర్తి**



**హన్మకొండ, సెప్టెంబర్ 23 (సమయం న్యూస్) :** పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవ, యువతలో చైతన్యం తీసు కురావడంలో చేస్తున్న కృషికి డాక్టర్ అనిత రెడ్డికి 'శ్రీగణేష్ ఎక్సలెన్స్ అవార్డు–2026' లభించింది. మనం ఫౌండేషన్, గ్లోబల్ హ్యూమన్ రైట్స్, యాంటీ కరప్షన్ అండ్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్ట్ సంయుక్తంగా ఈ అవార్డు ను అందజేశాయి. గణేష్ నవరాత్రుల సందర్భంగా పర్యావరణ హితమైన మట్టి వినాయక ప్రతిమలను ప్రోత్సహించడంతో పాటు ఉచితంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేయడం, ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించడం, డీజేలను నియంత్రించడం, పర్యావరణానికి హాని కలిగించే వస్తువులను వినియోగించవద్దంటూ ప్రజలకు అవగాహన కల్పించడం వంటి కార్యక్ర మాలను డా.అనితా రెడ్డి చేపట్టారు. ఆరోగ్య కరమైన సమాజ నిర్మాణం, యువతను సన్మార్గంలో నడిపించేందుకు ఆమె చేస్తున్న సేవలను గుర్తించిన సంస్థలు ఈ పురస్కా రానికి ఆమెను ఎంపిక చేశాయి. సంస్థ ఫౌండర్ చైర్మన్ అడ్వకేట్ డాక్టర్ చక్రవర్తి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడం, చెట్ల నరికి వేతను అరికట్టడం వంటి అంశాలపై పిల్లలు, యువత, పెద్దల్లో డాక్టర్ అనితా రెడ్డి కల్పిస్తున్న అవగాహన స్ఫూర్తిదాయక మన్నారు. గణేష్ నవరాత్రుల్లో పర్యావరణ హిత కార్యక్రమాలు నిర్వహించే వారిని ప్రోత్సహించేందుకు ఈ అవార్డును అందిస్తు న్నామని తెలిపారు. ఈసారి డాక్టర్ అనితా రెడ్డిని ఎంపిక చేయడం సంస్థలకు గర్వకార ణమన్నారు. ఈ సందర్భంగా అనురాగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడటం అంటే మనల్ని మనం కాపాడు కోవడమే కాదు భావితరాలకు ఆరోగ్యక రమైన జీవన వాతావరణాన్ని బహుమతిగా ఇవ్వడం. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, ఏ అవార్డు అందుకున్నా దానికి వన్నె తెచ్చేలా పనిచేయాలన్నదే నా నమ్మక మన్నారు. మాటలతో కాకుండా చేతలతో సేవ చేసి చూపిస్తానని స్పష్టం చేశారు.

# 22-ఏ భూములు తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు పంచాలి

- **తెలంగాణ జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్**



**నర్సంపేట, సెప్టెంబర్ 23 (సమయం న్యూస్) :** 22–ఏ కింద ఉన్న ప్రభుత్వ భూములపై సమగ్ర న్యాయ విచారణ జరిపించి, వాటిని తెలంగాణ అమరవీరుల కుటుంబాలు, ఉద్యమకారులకు పంచాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. నర్సం పేటలోని తెలంగాణ జన సమితి డివిజన్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు షేక్ జావిద్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం రాజకీయాలకు అతీతంగా సాగిందని, స్వరాష్ట్రం ఏర్పడిన అనంతరం పదేళ్లపాటు అధికారంలో ఉన్న గత ప్రభుత్వం ప్రభుత్వ భూములను ధరణి పేరుతో అక్రమంగా ఆక్రమించిందని అంబటి శ్రీనివాస్ ఆరోపించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై సమగ్ర విచారణ జరిపించి, అక్రమాలకు పాల్పడిన బాధ్యులతో పాటు సంబంధిత అధికా రులపై చట్టపరమైన చర్యలు తీసుకోవా లన్నారు. ధరణి వ్యవస్థ పేరుతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబానికి సంబంధించిన భూములపై వచ్చిన ఆరోప ణలపైనా సిట్టింగ్ న్యాయ మూర్తితో విచారణ జరిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా తెలంగాణ అమర వీరుల కుటుంబాలు, ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు కాకపోవడం బాధాకరమన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు సంబంధించిన 22–ఏ భూములపై న్యాయ విచారణ పూర్తిచేసి, అర్హులైన ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు న్యాయం చేయాలని, ఎన్నికల సమయంలో తెలంగాణ జన సమితితో కలిసి పోటీ చేసిన సందర్భంలో కాంగ్రెస్ అధినేతగా రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను బేషరతుగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రెండు ఎమ్మెల్సీ పదవులు, ఐదు కార్పొరేషన్ చైర్మన్ పదవులు, ఐదు జిల్లా స్థాయి చైర్మన్ పదవులు ఇస్తామని ఇచ్చిన హామీలను ఇప్పటికైనా నెరవేర్చాలని కోరారు. నిరుద్యో గులకు భరోసా కల్పించేలా వెంటనే ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించి, ఉద్యోగ నియామకాలు చేపట్టాలని అంబటి శ్రీనివాస్ సూచించారు. జీవో 95 ప్రకారం పాలిటెక్నిక్ కళాశాలలను మూసివేయడం వల్ల విద్యార్థుల్లో ఆందోళన నెలకొం టోందని, వెంటనే ఆ జీవోను రద్దు చేయాలని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్య మకారుల గుర్తింపు కమిటీ స్వీకరించిన సమాచారాన్ని ప్రభుత్వం పరిశీలించి, నిజమైన ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉద్యమకా రులకు ప్రభుత్వం భరోసా కల్పించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జన సమితి రాష్ట్ర నాయకులు గుంటి రామచందర్, బోనగాని రవీందర్, మహమ్మద్ మెహబూబ్ అలీ, సాంబరాతి మల్లేశం, కాసాని పద్మ, రామగిరి మాధవి, అకారపు సరోజన, రాజు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక ఉత్సవాల్లో అన్నదాన కార్యక్రమాలు

**పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్**




**కొడంగల్, సెప్టెంబర్ 23,(సమయం న్యూస్)** కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు గాంధీనగర్ కాలనీలో వినాయక ఉత్సవాల సందర్భంగా 12వ వార్డు కౌన్సిలర్ సుష్మా దామోదర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో, అలాగే కొడంగల్ మండల పరిధిలోని ఉడిమేశ్వరం గ్రామంలో లక్ష్మప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ గణనాథుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించి, వినాయక ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలను అభినందించారు.ఈ కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ సుష్మా దామోదర్, పర్సాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, ఉడిమేశ్వరం గ్రామ సర్పంచ్ కుమ్మరి శ్రీనివాస్,ఎస్సై జి. వి సత్యనారాయణ, వినాయక కమిటీ యువత, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, భక్తులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వినాయకుని లడ్డుని దక్కించుకున్న సిద్ధిక్ష రెడ్డి



**సంగారెడ్డి సెప్టెంబర్24 సమయం న్యూస్** జిల్లా రాయికోడ్ మండలం ఖంజామల్పూర్ గ్రామంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా వినాయకుని వద్ద గల లడ్డుని లక్కీ డ్రా పద్దతిలో నిర్వహించడం జరిగింది. ఈ లక్కీ డ్రా లో వందల మంది పాల్గొనగా, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీపాల్ రెడ్డి గారి కూతురు గారు సిద్ధిక్ష రెడ్డి గారు విజేతగా గెలిచి వినాయకుని లడ్డు ని దక్కించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి నరేష్, ఉప సర్పంచ్ నాగలక్ష్మి సిద్ధారెడ్డి , nsuiమండల్ ప్రెసిడెంట్ విలాస్ రెడ్డి , గణేష్ కమిటీ సభ్యులు శ్రీకాంత్ రెడ్డి, సంగారెడ్డి,జైపాల్ రెడ్డి, పాండురంగ రెడ్డి,ప్రశాంత్ రెడ్డి,నిఖిల్ రెడ్డి,వీరా రెడ్డి, పాండు, రవి మరియు గ్రామ పెద్దలు పాల్గొనడం జరిగింది.


## మైనర్ విద్యార్థులు వాహనాలు నడపకుండా తల్లి దండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి:

**కోస్గి ఎస్సై చంద్రశేఖర్**



**కోస్గి మున్సిపల్, సెప్టెంబర్,23(సమయం న్యూస్)**మైనర్ విద్యార్థులు ద్విచక్ర వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురికాకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోస్గి ఎస్సై చంద్రశేఖర్ సూచించారు.కోస్గి పోలీస్ స్టే షన్ పరిధిలో మైనర్ విద్యార్థులు ద్విచక్ర వాహనం నడుపుతున్న విషయం గుర్తించిన పోలీసులు, విద్యార్థి తండ్రి మాలెల ఈదప్ప (41), దౌల్తాబాద్ గ్రామంను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. అలాగే శాంతినికేతన్ పాఠశాల, కోస్గిలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి విషాల్కు, పాఠశాల ప్రిన్సిపాల్/హెచ్‌ఎం శ్రీరామ నరసింహులు లకు కౌన్సెలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై చంద్రశేఖర్ మాట్లాడుతూ... మైనర్ విద్యార్థులకు ద్విచక్ర వాహనాలు ఇవ్వడం వల్ల వారి భద్రతతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించేలా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు వాహనాల తాళాలు వారికి ఇవ్వకూడదని, పాఠశాల యాజమాన్యం కూడా విద్యార్థులలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని సూచించారు.మైనర్ డ్రైవింగ్‌కు పాల్పడే విద్యార్థులు, వాహనాలను వారికి ఇచ్చే తల్లిదండ్రులపై చట్టప్రకారం చర్యలు తప్పవని ఎస్సై చంద్రశేఖర్ హెచ్చరించారు.

## వినాయక నిమజ్జనం ఏర్పాట్ల ను పరిశీలించిన మండల అధికారులు.



**వలిగొండ సెప్టెంబర్ 23 (సమయం న్యూస్)**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ లోని అక్క చెల్లెల్ల చెరువు వద్ద వినాయక నిమజ్జనం సందర్భంగా వలిగొండ లోని అన్ని వినాయక విగ్రహాలు ఈ చెరువు వద్దనే నిమజ్జనం చేయడం జరుగుతుంది. కాబట్టి వినాయక నిమజ్జనానికి కావలసిన అన్ని ఏర్పాట్లు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వలిగొండఎంపీడీవో జలంధర్ రెడ్డి, సర్పంచ్ కుంభం వెంకట పాపిరెడ్డి, వార్డు సభ్యులు కూర శ్రీనివాస్,పంచాయతీ కార్యదర్శి రసూల్, గ్రామ ఉత్సవ కమిటీ సభ్యులు,రెవెన్యూ అధికారులు,ఫైర్ అధికారులు , విద్యుత్ అధికారులు, వైద్య సిబ్బంది,గ్రామ పెద్దలు,గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## వినయ్ భాస్కర్‌కు కేసీఆర్ ఫోన్. ఆరోగ్యంపై ఆరా..

### తమ్ముడు వినయ్.. ఉద్యమ నాటి గుర్తులను మళ్లీ గుర్తు చేశావు... కేసీఆర్




**హన్మకొండ, సెప్టెంబర్ 23 (సమయం న్యూస్) :** ఎంజీఎం ఆస్పత్రి సందర్శన సందర్భంగా పోలీసుల దాడిలో గాయపడిన మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌ను తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మంగళవారం రాత్రి ఫోన్‌లో పరామర్శించారు. వినయ్ భాస్కర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాటాన్ని కొనసాగించాలని సూచించారు. ప్రజలకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. తెలంగాణ ఉద్యమ సమయంలో వినయ్ భాస్కర్ పోషించిన పాత్రను గుర్తుచేసుకుంటూ తమ్ముడు వినయ్ ఉద్యమ నాటి గుర్తులను మళ్లీ గుర్తు చేశావని బావోద్వేగంగా అన్నారు. వినయ్ భాస్కర్ గాయపడిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా ఫోన్‌లో పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండాలని సూచించారు. మాజీ మంత్రి, శాసనసభలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్‌రావు సైతం వినయ్ భాస్కర్‌తో ఫోన్‌లో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఎంజీఎం ఆస్పత్రి సందర్శన సందర్భంగా చోటుచేసుకున్న ఘటనపై ఆరా తీసిన వారు ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేపట్టే కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

## గొడుగుగేరి గణేశుడికి ప్రత్యేక పూజలు చేసిన జిల్లా ఎస్పీ డాక్టర్. వినిత్ ఐపీఎస్



**నారాయణపేట, సెప్టెంబర్,23(సమయం న్యూస్)** నారాయణపేట జిల్లా కేంద్రంలోని చారిత్రక గొడుగుగేరి శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో కొలువు దీరిన విఘ్న వినాయకుడికి జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గణేశుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయడంతో పాటు ఆలయంలోని శ్రీ అభయాంజనేయ స్వామివారిని కూడా దర్శించుకుని ఆశీస్సులు పొందారు.ఇటీవల ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నూతన షెడ్డు ఏర్పాటు చేయడంతో పాటు ఆలయానికి రంగులు వేయించి సుందరీకరణ పనులు చేపట్టారు. దీంతో ఆలయం మరింత ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంది.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్‌ను ఘనంగా స్వాగతించారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కొండా శ్వేతా సత్యయాదవ్, వైస్ చైర్‌పర్సన్ మంజుల, వార్డు కౌన్సిలర్ నాగమ్మ,18వ వార్డు కౌన్సిలర్ గొల్ల రవితేజ యాదవ్, ఆర్టీఏ మెంబర్ పోషల్ రాజేష్ ను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పోషల్ వెంకట్రాములు, మిర్చి వెంకటయ్య, గొడుగు లక్ష్మణ్, పళ్ళ వెంకట్రాములు, కుంటిమారి అశోక్, సంజీవ్ ప్రకాష్, కావలి రాజు, గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శంకర్, కార్యదర్శి పళ్ళ రవి, పోషల్ సంతోష్, బొంబాయి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతులలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

### జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక



**నారాయణపేట, సెప్టెంబర్,23(సమయం న్యూస్)**2027–28 విద్యా సంవత్సరానికి గాను జవహర్ నవోదయ విద్యాలయాల్లో 9వ,11వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి నిర్వహించనున్న లాటరల్ ఎంట్రీ సెలక్షన్ టెస్ట్ (LEST–2027) కు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు.జవహర్ నవోదయ విద్యాలయ సమితి, హైదరాబాద్ ప్రాంతం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ ప్రవేశ పరీక్షకు సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ 2026 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభమైంది. సెప్టెంబర్ 30, 2026 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.9వ తరగతి LEST కోసం https://cbseitms.nic.in/2026/nvsix/_9 11వ తరగతి LEST కోసం https://cbseitms.nic.in/2026/nvsxi_11/ అర్హులైన విద్యార్థులు పై ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.లాటరల్ ఎంట్రీ సెలక్షన్ టెస్ట్ 2027 ఏప్రిల్ 10వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు.జిల్లాలోని ప్రభుత్వ, గుర్తింపు పొందిన ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జిల్లా విద్యాశాఖ అధికారులు, మండల విద్యాధికారులు అర్హులైన విద్యార్థులకు ఈ అవకాశంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు పరీక్షకు సంబంధించిన వివరాలను తెలియజేసి గరిష్టంగా దరఖాస్తులు నమోదయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు.జవహర్ నవోదయ విద్యాలయాల్లో 9వ, 11వ తరగతుల్లో ప్రవేశం పొందేందుకు అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

# ఉత్సవాలతో గ్రామాల్లో ఐక్యత చాటాలి

### జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS



**నారాయణపేట, సెప్టెంబర్,23(సమయం న్యూస్)**

కోటకొండ గ్రామంలో గణేష్ నిమజ్జన వేడుకలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ గణపతి దేవునికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం గ్రామ ప్రజలు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, యువతతో కలిసి నిమజ్జన శోభాయాత్రను తిలకించిఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS మాట్లాడుతూ..ఉత్సవాలతో గ్రామాలలో ఐక్యత చాటాలని, కోటకొండ గ్రామం ఐక్యతకు, సామరస్యానికి చిరునామాగా నిలుస్తుందని అన్నారు. గ్రామంలో మొత్తం 58 గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసి, అందరూ కలిసి భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. గణేష్ శోభాయాత్ర, నిమజ్జనం సందర్భంగా పోలీస్ శాఖ సూచనలను పాటిస్తూ గ్రామ ప్రజలు, గణేష్ ఉత్సవ కమిటీలు, యువత డీజేలను వినియోగించకుండా పోలీస్ శాఖకు సహకరించడం పట్ల ఎస్పీ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ప్రజల భద్రత,శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్ శాఖ చేసిన విజ్ఞప్తిని గౌరవించి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. పండుగల సందర్భంగా భక్తి, ఆనందంతో పాటు ప్రజల భద్రతకు, శాంతియుత వాతావరణానికి ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ సూచించారు.శోభాయాత్ర సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీసులకు సహకరించాలని, యువత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా పూర్తయ్యేలా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవసరమైన బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ శాంతియుత వాతావరణంలో నిమజ్జన వేడుకలను నిర్వహించుకోవాలని సూచించారు.గణపతి దేవుని ఆశీస్సులు ఎల్లవేళలా కోటకొండ గ్రామ ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు. గణేష్ నిమజ్జన వేడుకలు సోదరభావం, ఐక్యత, సామరస్యానికి ప్రతీకగా నిలవాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్సై సతీష్ రెడ్డి, బీజేపీ నాయకులు పగుడకుల శ్రీనివాసులు, విశ్వహిందూ పరిషత్ ప్రచార ప్రముక్ పగడాకుల భాగస్వామి, పూజారి శాంత నంద, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వినాయకుడి నిమజ్జనం ప్రశాంతంగా.. ప్రతి భక్తుడూ సురక్షితంగా..

- వర్షా ల నేపథ్యంలో గణపతి మండపాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలి
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



**హనుమకొండ, సెప్టెంబర్ 23 (సమయం న్యూస్) :** భారీ వర్షాల సూచనల నేపథ్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సూచించారు. రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున గణేశ్ నిమజ్జన కార్యక్రమాలను సురక్షితంగా నిర్వహించేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తమ డివిజన్ల పరిధిలోని గణేశ్ మండపాల నిర్వాహకులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ అవసరమైన సూచనలు, సహకారం అందించాలని ఎమ్మెల్యే సూచించారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులతో కలిసి పరిస్థితులను పర్యవేక్షించాలని కోరారు. భారీ గణేశ్ విగ్రహాలు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో విద్యుత్ తీగలు, చెట్లు తదితరాల వల్ల ప్రమాదాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. నిమజ్జన సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసు శాఖకు సహకరించాలని సూచించారు. భక్తులు, నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించాలని కోరారు. నిమజ్జన కార్యక్రమాలు సజావుగా, సురక్షితంగా జరిగేలా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని నాయిని రాజేందర్‌రెడ్డి ఆదేశించారు. ముఖ్యంగా వర్షాల నేపథ్యంలో భక్తులు, నిర్వాహకుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు.

## ఎస్ఐఆర్‌లో అర్హులైన ప్రతిఓటరుకు ఓటు హక్కు కల్పించాలి

- బీఎల్‌వో సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రియాంక.



**నారాయణపేట, సెప్టెంబర్,23(సమయం న్యూస్)**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియలో భాగంగా అర్హత కలిగిన ప్రతి ఓటరుకు ఓటు హక్కు ఉండేలా బూత్ లెవల్ అధికారులు (BLOలు) సమగ్రంగా సర్వే నిర్వహించి, అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు.బుధవారం నారాయణపేట పట్టణంలోని 142, 143 పోలింగ్ స్టేషన్ల పరిధిలో కొనసాగుతున్న బీఎల్‌వోల సర్వేను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో నోటీసులు అందుకున్న ఓటర్ల ఇళ్లకు స్వయంగా వెళ్లి వివరాలను ధృవీకరించాలని, వారి నుంచి అవసరమైన ధృవీకరణ పత్రాలను సేకరించి, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని బీఎల్వోలకు ఆమె సూచించారు.ఓటర్ల వివరాల పరిశీలనలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా క్షేత్రస్థాయిలో పూర్తి స్థాయిలో ధృవీకరణ చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో 14 వ వార్డు కౌన్సిలర్ ఎల్.అరుణ పాల్గొన్నారు.

**ప్రభుత్వ జూనియర్ కళాశాల తనిఖీ**

అనంతరం జిల్లా కలెక్టర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేసి అధ్యాపకులు, విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. క ళాశాల లో విద్యాబోధన,విద్యార్థుల హాజరు తదితర అంశాలపై విద్యార్థులతో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత విద్యను అందించేందుకు పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేస్తోందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ సూచించారు.

**మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష**

ఆ తర్వాత జిల్లా కలెక్టర్ నారాయణపేట మున్సిపల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. పట్టణంలో కొనసాగుతున్న పరిశుభ్రత చర్యలు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ సేవలను సమర్థవంతంగా అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

# పౌష్టికాహారంతోనే తల్లి బిడ్డల ఆరోగ్యం..

### గజ్వేల్ ప్రాజెక్ట్ సిడిపిఓ సరిత.

**రాయపోల్ సెప్టెంబర్ 23.**

పౌష్టికాహారంతోనే తల్లి బిడ్డలు సురక్షితంగా ఉంటారని రాబోయే తరం ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కావాలంటే గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలకు పోషకాహారం తప్పనిసరిగా అవసరమని గర్భిణులకు పుట్టబోయే బిడ్డ సురక్షితంగా ఉండాలంటే పోషకాహారం తీసుకోవాలని గజ్వేల్ ప్రాజెక్ట్ సిడిపిఓ సరిత అన్నారు. బుధవారం రాయపోల్ మండల కేంద్రం అంగన్వాడి కేంద్రంలో సెక్టర్ స్థాయి పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలకు పోషకాహారం పై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ప్రతి సంవత్సరం పోషణ్ అభియాన్ లో భాగంగా సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు పోషకాహార మాసోత్సవాలు నిర్వహించడం జరుగుతుంది. పోషకాహార లోపంలేని గ్రామాల లక్ష్యంగా ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందిస్తుందన్నారు.తల్లిపాల ప్రాముఖ్యత, పోషకాహారం గురించి వివరించడం జరిగింది. గర్భిణీ మొదటి రోజు నుంచి వెయ్యి రోజుల వరకు పోషకాహార ప్రాముఖ్యత వివరిస్తూ ప్రతినెల తల్లి బిడ్డల బరువులు, ఎత్తులు తూచి పోషకాహార లోపం ఉంటే వైద్యుల సూచన మేరకు వారికి అదనంగా పోషకాహారం అందజేసి సాధారణ స్థితికి తీసుకురావడానికి అంగన్వాడి టీచర్లు ప్రత్యేక చొరవ తీసుకుంటారన్నారు. గర్భిణీ, బాలింత మహిళలు అందరూ తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని, అప్పుడే పండంటి బిడ్డకు జన్మనిస్తారని, బిడ్డకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేకుండా జన్మించాలంటే తల్లి తప్పనిసరిగా పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. గర్భిణీలు ఎల్లప్పుడూ వైద్యుల సూచనల మేరకు ఆరోగ్య ఆహార నియమాలను పాటించాలన్నారు. ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాలలో గర్భిణులకు పౌష్టికాహారం అందించడం జరుగుతుందని,ప్రతి ఒక్కరు రోజు పౌష్టికాహారం తీసుకోవాలని, పౌష్టికాహారం వలన కలిగే ఉపయోగాలపై గర్భిణీ,బాలింత స్త్రీలందరికీ అవగాహన కల్పించడం జరిగిందన్నారు.




ముఖ్యంగా గర్భిణీ మహిళలు ఈ సమయంలో ఎలాంటి మానసిక ఒత్తిడులకు గురి కావద్దని, ఆరోగ్యానికి హాని కలిగించే ఏ పని చేయకూడదని, ఎల్లప్పుడూ సంతోషంగా ఉన్నట్లయితే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యవంతంగా జన్మిస్తారని తెలియజేశారు. ప్రతి మహిళకు జీవితంలో అమ్మ అని పిలిపించుకోవాలని ఎంతో కుతూహలంగా ఉంటుందని అమ్మతనం అనేది ఎంతో అద్భుతమైనదన్నారు. కాబట్టి గర్భిణీలు అన్ని రకాలుగా జాగ్రత్తలు తీసుకుంటూ పండంట బిడ్డకు జన్మనివ్వాలని సూచించారు. అలాగే గర్భిణీ మహిళలకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించి పోషణ ప్రతిజ్ఞ చేపించారు.ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ షబానా, ఉప సర్పంచ్ హనుమంతు రాజు,రాయపోల్ సెక్టార్ అంగన్వాడి టీచర్లు, గర్భిణీ, బాలింత మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల స్కీట్ టీమ్‌కు కాంస్యం



**నాగోయా, సెప్టెంబరు 23 (సమయం న్యూస్):** జపాన్‌లో జరుగుతున్న 2026 ఆసియా క్రీడల్లో భారత షూటర్లు మరోసారి సత్తా చాటారు. మహిళల స్కీట్ టీమ్ ఈవెంట్‌లో రైజా ధిల్లాన్, మహేశ్వరి చౌహాన్, పరినాజ్ ధలివాల్‌తో కూడిన భారత జట్టు కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. ముగ్గురు షూటర్లు సమష్టిగా నిలకడైన ప్రదర్శన చేయడంతో భారత్ పతకాల పట్టికలో మరో పతకాన్ని జత చేసుకుంది. మహిళల స్కీట్ టీమ్ పోటీలో భారత బృందం అర్హత దశలో 331 పాయింట్లు సాధించి మూడో స్థానంలో నిలిచింది. చైనా జట్టు 357 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి స్వర్ణ పతకాన్ని దక్కించుకోగా.. కజకిస్థాన్ 336 పాయింట్లతో రజతాన్ని సాధించింది. భారత షూటర్లు చివరి వరకు పోరాడి మూడో స్థానాన్ని నిలబెట్టుకోవడంతో కాంస్య పతకం ఖరారైంది. రైజా ధిల్లాన్, మహేశ్వరి చౌహాన్, పరినాజ్ ధలివాల్ ముగ్గురూ పోటీలో తమ వంతు ప్రదర్శనను సమర్థంగా పూర్తి చేశారు. ముఖ్యంగా కీలక దశల్లో లక్ష్యాలను ఛేదించడంలో చూపిన నిలకడ భారత జట్టుకు ఉపయోగపడింది. ఆసియా క్రీడల్లో మహిళల స్కీట్ టీమ్ విభాగంలో భారత్‌కు లభించిన ఈ పతకం ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ విజయంతో ఆసియా క్రీడల్లో భారత షూటింగ్ బృందం ఖాతాలో మరో పతకం చేరింది. ఇప్పటికే షూటింగ్‌లో భారత క్రీడాకారులు పలు విభాగాల్లో పతకాలు సాధించగా.. మహిళల స్కీట్ టీమ్ కాంస్యంతో ఆ సంఖ్య ఆరుకు చేరింది. వరుసగా పతకాలు సాధిస్తుండటంతో భారత షూటర్ల ప్రదర్శనపై అంచనాలు మరింత పెరిగాయి. మొత్తంగా 2026 ఆసియా క్రీడల్లో భారత్ సాధించిన పతకాల సంఖ్య ఎనిమిదికి చేరింది. ఇందులో ఒక స్వర్ణం, నాలుగు రజతాలు, మూడు కాంస్య పతకాలు ఉన్నాయి. ఆసియా క్రీడల పోటీలు ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో భారత్ నుంచి మరిన్ని పతకాలు వస్తాయని క్రీడాభిమానులు ఆశిస్తున్నారు. షూటింగ్‌తో పాటు ఇతర క్రీడాంశాల్లోనూ భారత అథ్లెట్లు తమ ప్రతిభను చాటేందుకు బరిలోకి దిగుతున్నారు. మహిళల స్కీట్ టీమ్ సాధించిన ఈ కాంస్య పతకం భారత షూటింగ్ బృందానికి మరింత ఉత్సాహాన్ని అందించనుంది. రాబోయే పోటీల్లోనూ భారత షూటర్లు మెరుగైన ప్రదర్శనతో మరిన్ని పతకాలు సాధించేందుకు ప్రయత్నించనున్నారు.

# టీ20ల్లో భారత్ 200వ విజయం



**నాగోయా, సెప్టెంబరు 23 (సమయం న్యూస్):** అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో టీమిండియా సరికొత్త చరిత్ర సృష్టించింది. జపాన్‌తో జరిగిన ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో రెండు పరుగుల తేడాతో విజయం సాధించడం ద్వారా భారత్ అంతర్జాతీయ టీ20ల్లో 200 విజయాలు పూర్తి చేసుకున్న తొలి జట్టుగా నిలిచింది. ఈ క్రమంలో పాకిస్థాన్‌తో పాటు ఇతర అంతర్జాతీయ జట్లను వెనక్కి నెట్టి అరుదైన ఘనతను సాధించింది. 291 మ్యాచ్‌లు.. 200 విజయాలు: 2006లో అంతర్జాతీయ టీ20 ప్రయాణాన్ని ప్రారంభించిన భారత్ ఇప్పటివరకు 291 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో ఏకంగా 200 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. 81 మ్యాచ్‌ల్లో ఓటమి ఎదుర్కొన్న భారత్.. ఒక మ్యాచ్‌ను టైగా ముగించగా, మరో తొమ్మిది మ్యాచ్‌ల్లో ఫలితం తేలలేదు. అంతర్జాతీయ టీ20ల్లో ఇంతటి విజయాల సంఖ్యను సాధించిన తొలి జట్టుగా భారత్ రికార్డు సృష్టించింది. పాక్‌కు 24 విజయాల ఆధిక్యం: అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక విజయాలు సాధించిన జట్ల జాబితాలో పాకిస్థాన్ 176 విజయాలతో రెండో స్థానంలో ఉంది. పాకిస్థాన్ 2005 నుంచి ఇప్పటివరకు 303 టీ20 మ్యాచ్‌లు ఆడింది. భారత్ ప్రస్తుతం పాక్ కంటే 24 విజయాల ఆధిక్యంలో ఉంది. ఇంగ్లాండ్ దేశవాళీ జట్లలో సోమర్సెట్ 174 విజయాలతో తర్వాతి స్థానంలో ఉండగా.. లాంకషైర్ 166 విజయాలు సాధించింది. ఐపీఎల్‌లో ముంబయి ఇండియన్స్ కూడా 166 విజయాలతో ఉంది. చెన్నై సూపర్ కింగ్స్, సర్రే జట్లు 163 విజయాలతో తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నాయి. జపాన్‌తో ఉత్కంఠ పోరు: 200వ విజయం సాధించిన మ్యాచ్‌లో మాత్రం టీమిండియాకు ఊహించని స్థాయిలో పోటీ ఎదురైంది. వర్షం కారణంగా మ్యాచ్‌ను ఐదు ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 4 వికెట్ల నష్టానికి 32 పరుగులు మాత్రమే చేసింది. చిన్న లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన జపాన్ చివరి వరకు పోరాడింది. అయితే భారత బౌలర్లు కీలక సమయంలో వికెట్లు తీసి జపాన్‌ను 3 వికెట్లకు 30 పరుగులకే పరిమితం చేశారు. చివరి ఓవర్‌లో జపాన్ విజయానికి ఎనిమిది పరుగులు అవసరమైన సమయంలో భారత బౌలర్లు ఒత్తిడిని తట్టుకుని అద్భుతంగా బౌలింగ్ చేశారు. చివరి బంతి వరకు ఉత్కంఠ కొనసాగినా.. జపాన్ రెండు పరుగుల దూరంలో నిలిచిపోయింది. దీంతో భారత్ రెండు పరుగుల తేడాతో విజయం సాధించి 200వ అంతర్జాతీయ టీ20 విజయాన్ని నమోదు చేసింది. టీ20ల్లో భారత్ సాధించిన ఈ మైలురాయి ఆ ఫార్మాట్‌లో జట్టు సాధించిన స్థిరమైన విజయాలకు మరో గుర్తింపుగా నిలిచింది. ముఖ్యంగా 200వ విజయం కూడా అత్యంత ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో రావడంతో ఈ రికార్డు మరింత ప్రత్యేకంగా మారింది.

# మీరాబాయి మెడలో ఆసియా రజతం

49 కిలోల వెయిట్‌లిఫ్టింగ్‌లో అద్భుత ప్రదర్శన




**నగోయా (జపాన్), సెప్టెంబర్ 23 (సమయం న్యూస్):** భారత స్టార్ వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను ఎట్టకేలకు ఆసియా క్రీడల్లో పతకం సాధించారు. ఐచి--నగోయా ఆసియా క్రీడల్లో బుధవారం జరిగిన మహిళల 49 కిలోల విభాగంలో అద్భుత ప్రదర్శన చేసిన మీరాబాయి రజత పతకాన్ని సొంతం చేసుకున్నారు. స్నాచ్‌లో 87 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 111 కిలోలతో మొత్తం 198 కిలోలు ఎత్తి రెండో స్థానంలో నిలిచారు. మీరాబాయి కెరీర్‌లో ఇదే తొలి ఆసియా క్రీడల పతకం. ఒలింపిక్స్‌లో రజతం.. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం.. కామన్వెల్త్ క్రీడల్లో మూడు స్వర్ణాలు.. ఇలా ఎన్నో అంతర్జాతీయ విజయాలు సాధించిన మీరాబాయి ఖాతాలో ఆసియా క్రీడల పతకం మాత్రం ఇప్పటివరకు లేదు. 2014 ఇంచియాన్ ఆసియా క్రీడల్లో తొమ్మిదో స్థానంలో నిలిచిన ఆమె, 2018 జకార్తా క్రీడలకు వెన్ను గాయం కారణంగా దూరమయ్యారు. 2023 హాంగ్‌జౌ క్రీడల్లో నాలుగో స్థానంతో పతకాన్ని త్రుటిలో చేజార్చుకున్నారు. ఈసారి మాత్రం రజతంతో ఆ లోటును భర్తీ చేశారు. స్నాచ్‌లో 83 కిలోలతో పోటీ ప్రారంభించిన 32 ఏళ్ల మీరాబాయి తొలి ప్రయత్నాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. రెండో ప్రయత్నంలో 85 కిలోలు, మూడో ప్రయత్నంలో 87 కిలోలను ఎత్తారు. దీంతో స్నాచ్ ముగిసే సమయానికి మూడో స్థానంలో నిలిచారు. క్లీన్ అండ్ జెర్క్‌లో 111 కిలోల అత్యుత్తమ లిఫ్ట్‌తో రెండో స్థానానికి దూసుకెళ్లి రజతాన్ని ఖాయం చేసుకున్నారు. మీరాబాయి రజతంతో ఆసియా క్రీడల వెయిట్‌లిఫ్టింగ్‌లో భారత్ 28 ఏళ్ల పతక నిరీక్షణకు తెరపడింది. చివరిసారిగా 1998 బ్యాంకాక్ ఆసియా క్రీడల్లో కరణం మల్లేశ్వరి రజత పతకం సాధించారు. ఆ తర్వాత ఈ విభాగంలో భారత్‌కు పతకం దక్కలేదు. ఇప్పుడు మీరాబాయి ఆ సుదీర్ఘ నిరీక్షణకు ముగింపు పలికారు. ఉత్తర కొరియాకు చెందిన రి సాంగ్ గమ్ అసాధారణ ప్రదర్శనతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు. స్నాచ్‌లో 94 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 121 కిలోలతో మొత్తం 215 కిలోలు ఎత్తారు. స్నాచ్, క్లీన్ అండ్ జెర్క్, మొత్తం బరువు.. మూడు విభాగాల్లోనూ ప్రపంచ రికార్డులు నెలకొల్పారు. ఆసియా క్రీడల్లో ఆమెకు ఇది వరుసగా మూడో స్వర్ణ పతకం. ఇండోనేషియాకు చెందిన లులుక్ డయానా త్రి విజయానా 191 కిలోల మొత్తం బరువుతో కాంస్యం సాధించారు. ఆసియా క్రీడల పతకాన్ని తన ఖాతాలో చేర్చుకున్న మీరాబాయి చాను.. తన సుదీర్ఘ కెరీర్‌లో మిగిలిపోయిన ప్రధాన లోటును ఈ



# రషీద్ ఖాన్‌ను వెనక్కి నెట్టిన అబ్రార్

**దుబాయ్, సెప్టెంబరు 23 (సమయం న్యూస్):** ఐసీసీ తాజాగా విడుదల చేసిన టీ20 బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అనూహ్య మార్పు చోటుచేసుకుంది. అఫ్గానిస్థాన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ నంబర్ వన్ స్థానాన్ని కోల్పోగా.. పాకిస్థాన్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్ ఎలాంటి మ్యాచ్ ఆడకుండానే అగ్రస్థానానికి చేరుకున్నాడు. 736 రేటింగ్ పాయింట్లతో అబ్రార్ నంబర్ వన్ టీ20 బౌలర్‌గా నిలిచాడు. ఇటీవల భారత్‌తో జరిగిన మూడో టీ20లో రషీద్ ఖాన్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో నాలుగు ఓవర్లు వేసిన అతడు 43 పరుగులు ఇచ్చాడు. ఈ ప్రదర్శనతో రేటింగ్ పాయింట్లు తగ్గడంతో 735 పాయింట్లతో రెండో స్థానానికి పడిపోయాడు. అబ్రార్ అహ్మద్ ఫిబ్రవరి తర్వాత అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఆడలేదు. అయినప్పటికీ రషీద్ పాయింట్లు తగ్గడంతో అబ్రార్‌కు అగ్రస్థానం దక్కింది. ఆస్ట్రేలియా స్పిన్నర్ ఆడమ్ జంపా 700 పాయింట్లతో మూడో స్థానంలో ఉండగా.. ఇంగ్లండ్ స్పిన్నర్ ఆదిల్ రషీద్ నాలుగో స్థానంలో, ఆస్ట్రేలియా బౌలర్ నాథన్ ఎల్లిస్ ఐదో స్థానంలో ఉన్నారు. భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి అత్యుత్తమ స్థానంలో కొనసాగుతున్నాడు. అఫ్గానిస్థాన్‌తో జరిగిన చివరి టీ20కి గాయం కారణంగా దూరమైన వరుణ్.. టాప్-5 నుంచి ఏడో స్థానానికి పడిపోయాడు. మరోవైపు ఇంగ్లండ్ ఆటగాడు జేమీ ఓవర్టన్ 47 స్థానాలు ఎగబాకి ఆరో స్థానానికి చేరుకున్నాడు. భారత ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ 12 స్థానాలు మెరుగుపరుచుకుని 639 రేటింగ్ పాయింట్లతో 15వ స్థానంలో నిలిచాడు.

# భారత్‌తో టీ20 సిరీస్‌కు న్యూజిలాండ్ జట్టు

**క్రైస్ట్‌చర్చ్, సెప్టెంబరు 23 (సమయం న్యూస్):** భారత్‌తో జరగనున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు న్యూజిలాండ్ 16 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. స్పిన్ ఆల్‌రౌండర్ మిచెల్ శాంట్నర్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఏడాదికి పైగా జాతీయ జట్టుకు దూరంగా ఉన్న ఫాస్ట్‌బౌలర్ ఆడమ్ మిల్నే తిరిగి జట్టులోకి రావడం ఈ ఎంపికలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇటీవల జరిగిన టీ20 ప్రపంచకప్‌లో రన్నరప్‌గా నిలిచిన న్యూజిలాండ్ జట్టులోని 13 మంది ఆటగాళ్లకు ఈ సిరీస్‌లోనూ చోటు దక్కింది. అయితే స్టార్ ఆల్‌రౌండర్ రచిన్ రవీంద్ర గాయం కారణంగా దూరమయ్యాడు. ఓ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న సమయంలో అతడి కుడి భుజానికి గాయమైంది. దీంతో టీ20 సిరీస్‌కు విశ్రాంతి ఇచ్చారు. వన్డే సిరీస్ నాటికి అతడు కోలుకుంటాడని జట్టు యాజమాన్యం భావిస్తోంది. టీ20 ప్రపంచకప్‌కు గాయం కారణంగా దూరమైన స్పిన్ ఆల్‌రౌండర్ మైఖేల్ బ్రేస్‌వెల్ కూడా తిరిగి జట్టులోకి వచ్చాడు. మరోవైపు భారత బ్యాటర్లను ఎదుర్కొనేందుకు న్యూజిలాండ్ బలమైన పేస్ దళాన్ని సిద్ధం చేసింది. జట్టులో ఆడమ్ మిల్నేతో పాటు లాకీ ఫెర్గూసన్, మాట్ హెన్రీ, కైల్ జేమీసన్, జాకబ్ డఫ్ఫీ, జాక్ ఫౌల్క్స్, నాథన్ స్మిత్ ఉన్నారు. భారత్-న్యూజిలాండ్ టీ20 సిరీస్ అక్టోబరు 22న క్రైస్ట్‌చర్చ్‌లోని హగ్లీ ఓవల్‌లో తొలి మ్యాచ్‌తో ప్రారంభం కానుంది. అనంతరం ఇరు జట్ల మధ్య వన్డే, టెస్టు సిరీస్‌లు కూడా జరగనున్నాయి. న్యూజిలాండ్ టీ20 జట్టు: మిచెల్ శాంట్నర్ (కెప్టెన్), ఫిన్ అలెన్, మైఖేల్ బ్రేస్‌వెల్, మార్క్ చాప్‌మన్, డెవాన్ కాన్వే, జాకబ్ డఫ్ఫీ, లాకీ ఫెర్గూసన్, జాక్ ఫౌల్క్స్, మాట్ హెన్రీ, బెవాన్ జాకబ్స్, కైల్ జేమీసన్, ఆడమ్ మిల్నే, డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్, టిమ్ సీఫెర్ట్, నాథన్ స్మిత్.





# పెళ్లి, మాతృత్వంపై శృతి హాసన్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, సెప్టెంబరు 23 (సమయం న్యూస్):** ప్రముఖ కథానాయిక శృతి హాసన్ తన వ్యక్తిగత జీవితం, ఆరోగ్యం మరియు మాతృత్వంపై పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. నటి సోహా అలీ ఖాన్ నిర్వహిస్తున్న 'ఆల్ అబౌట్ హర్' పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆమె, వివాహ వ్యవస్థ మరియు తల్లికావడంపై తన అభిప్రాయాలను నిష్కపటంగా వెల్లడించారు. గతంలో తన జీవితంలో ఒకసారి వివాహం వరకు వెళ్లి చివరి నిమిషంలో నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నట్లు శృతి వెల్లడించారు. జీవిత భాగస్వామి తోడు కోరుకున్నప్పటికీ, పెళ్లి అనే చట్టబద్ధమైన వ్యవస్థలో ఇమిడిపోవడం తనకు ఇష్టం లేదని స్పష్టం చేశారు. ఆడంబరంగా పెళ్లిళ్లు చేసుకునే ఖర్చును అవసరంలో ఉన్నవారికి సాయం చేయడానికి ఉపయోగిస్తే ఎంతో మేలని, కేవలం కాగితాలపై సంతకాలు చేయడం కాకుండా ఇద్దరు వ్యక్తులు రోజూ ప్రేమతో కలసి ఉండటమే నిజమైన బంధమని పేర్కొన్నారు. చిన్నతనంలోనే పీసీఓఎస్ (పాలీసిస్టిక్ ఓవరీ సింద్రోమ్) సమస్యల కారణంగా భవిష్యత్తులో సంతానప్రాప్తి కష్టమని వైద్యులు చెప్పడంతో మాతృత్వం పట్ల తనకు ఎంతో భయం ఉండేదని శృతి తెలిపారు. అయితే ఇటీవల వైద్యుల సలహాలతో ఆ భయాలు వీడి, తల్లిగా మారాలనే కోరిక పెరిగిందని వెల్లడించారు. దీనికోసం పెళ్లి చేసుకోవాల్సిన అవసరం లేదని, దత్తత ద్వారా లేదా సాంకేతిక మార్గాల ద్వారా సొంత బిడ్డకు తల్లి అయ్యేందుకు సిద్ధంగా ఉన్నానని ఆమె స్పష్టం చేశారు.

# టాలీవుడ్ రీ-ఎంట్రీపై మలయాళ భామ కళ్యాణి ప్రియదర్శన్ చూపు

**హైదరాబాద్, సెప్టెంబరు 23 (సమయం న్యూస్):** తక్కువ సినిమాలతోనే తెలుగు ప్రేక్షకుల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న మలయాళ నటి కళ్యాణి ప్రియదర్శన్, సరైన కథ లభిస్తే టాలీవుడ్‌లోకి మళ్లీ రీ-ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ప్రముఖ దర్శకుడు ప్రియదర్శన్ కుమార్తెగా చిత్రసీమలోకి అడుగుపెట్టిన ఆమె, తన సహజసిద్ధమైన నటనతో తెలుగు యూత్‌లో విశేషమైన అభిమాన గణాన్ని సంపాదించుకున్నారు.

## పరిమిత అవకాశాలు.. చెరగని ముద్ర

అక్కినేని అఖిల్ కథానాయకుడిగా నటించిన 'హలో' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన కళ్యాణి, తొలి సినిమాతోనే మంచి గుర్తింపు పొందారు. ఆ తర్వాత సాయి ధరమ్ తేజ్‌తో నటించిన 'చిత్రలహరి' బాక్సాఫీస్ వద్ద విజయం సాధించగా, శర్వానంద్ సరసన చేసిన 'రణరంగం' ఆశించిన విజయాన్ని అందించలేకపోయింది. టాలీవుడ్‌లో కేవలం మూడు సినిమాలు మాత్రమే చేసినప్పటికీ, ఆమె పాత్రలకు ప్రేక్షకుల నుంచి మంచి ప్రశంసలు లభించాయి.

ప్రస్తుతం మలయాళంలో వరుస విజయాలతో దూసుకుపోతున్న ఈ కథానాయిక, స్క్రిప్ట్ ప్రాధాన్యత ఉన్న మంచి పాత్ర లభిస్తే తెలుగులో మళ్లీ అలరించేందుకు ఆసక్తి చూపుతున్నారు. సోషల్ మీడియాలో నిరంతరం క్రియాశీలకంగా ఉంటూ అభిమానులకు చేరువగా ఉండే కళ్యాణి, త్వరలోనే ఒక మంచి ప్రాజెక్ట్‌తో తెలుగు ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సినీ వర్గాలు భావిస్తున్నాయి.



# సదా భావోద్వేగ వ్యాఖ్యలు

హైదరాబాద్, సెప్టెంబరు 23 (సమయం న్యూస్): 'జయం' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న కథానాయిక సదా, తన సినీ ప్రయాణంలోని ఒడుదొడుకులు మరియు బుల్లితెర ప్రదర్శనల గురించి పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఇటీవల ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె, సినీ పరిశ్రమలో సరైన మార్గదర్శకత్వం లేకపోవడం వల్ల కొన్ని అవకాశాలను కోల్పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.నితిన్ నటించిన చిత్రంలో 'రాను రాను అంటుందో చిన్నదో' పునర్నిర్మిత గీతం కోసం తనను సంప్రదించడానికి నిర్మాతలు ప్రయత్నించినట్లు తెలిసినప్పటికీ, ఆ వార్త తన వరకు రాలేదని, మధ్యలో ఆఫర్లను ఎవరు అడ్డుకుంటున్నారో అర్థం కావడం లేదని స్పష్టం చేశారు. 'ఢీ' నృత్య ప్రదర్శనకు వరుసగా మూడేళ్ల పాటు న్యాయనిర్ణేతగా వ్యవహరించిన తర్వాత ఒకే రకమైన శైలి అనిపించడంతోనే విరామం తీసుకున్నానని ఆమె తెలిపారు. తమిళంలో చేసిన 'టార్చ్ లైట్' చిత్రంలో మహిళా ప్రాధాన్యత ఉన్న కథ కావడంతోనే సాహసంతో ఆ పాత్ర చేశానని, అయితే ప్రేక్షకులు దాన్ని కథగా కాకుండా తన పాత్రను ప్రశ్నించడం దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొన్నారు. సినిమాలకు దూరమైనప్పటికీ ప్రేక్షకులు చూపుతున్న ఆదరణ పట్ల ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



# కుటుంబానికే నిషా ప్రాధాన్యత

హైదరాబాద్, సెప్టెంబరు 23 (సమయం న్యూస్): సినీ పరిశ్రమలో వారసత్వంగా అడుగుపెట్టి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటీనటులలో నిషా అగర్వాల్ ఒకరు. స్టార్ కథానాయిక కాజల్ అగర్వాల్ సోదరిగా చిత్రసీమలోకి అడుగుపెట్టిన ఆమె, తక్కువ సమయంలోనే తన అందం, అభినయంతో ప్రేక్షకులను అలరించారు. 2010లో వరుణ్ సందేశ్ సరసన 'ఏమైంది ఈ వేళ' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమై తొలి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకున్నారు. ఆ తర్వాత 'సోలో', 'సుకుమారుడు', 'డీకే బోస్' వంటి చిత్రాలలో నటించి తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే కెరీర్ ఊపందుకుంటున్న సమయంలోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టిన నిషా, ఆ తర్వాత మాతృత్వానికి ప్రాధాన్యతనిస్తూ నటనకు పూర్తిస్థాయిలో స్వస్తి చెప్పారు. అక్క కాజల్ అగర్వాల్ ఇప్పటికీ వరుస సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ, నిషా మాత్రం కుటుంబ జీవితానికే మొగ్గు చూపారు. వెండితెరకు దూరమైనప్పటికీ, సోషల్ మీడియా వేదికగా నిరంతరం అభిమానులతో ముచ్చటిస్తూ తన విశేష క్రేజ్‌ను కొనసాగిస్తున్నారు.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **7036644111, 9490140565**

# ప్రభుత్వ పతాకాల పై అవగాహన కార్యక్రమం

**ఆపరేషన్ మెర్సీ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో**




**ఉట్కూర్ మండలం, సెప్టెంబర్,23(సమయం న్యూస్)** ఉట్కూర్ మండలంలోని డ్వాక్రా భవనంలో OMIF ( ఆపరేషన్ మెర్సీ ఇండియా ఫౌండేషన్ ) అధ్వర్యంలో మహిళలకు ప్రభుత్వ పతాకాల పై స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలు పై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు అవగాహన కల్పించడం జరిగింది. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పతాకాల ను సద్వినియోగం చేసుకోవాలని ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి అని నీటినీ. సంరక్షించుకోవాలని ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని రోగాలు రాకుండా మనం జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు OMIF జిల్లా కోఆర్డినేటర్ S. హాజమ్మ మాట్లాడుతూ,,OMIF సంస్థ ఉమ్మడి జిల్లాలో 350 గ్రామాల్లో జోగిని వ్యవస్థ నిర్మూలన బాల్య వివాహాలు మహిళల సంక్షేమం బాలికలకు వొకేషనల్ trainings మహిళలకు ఫ్రీ టైలరింగ్ శిక్షణలు అందిస్తూ వారి సంక్షేమం కోసం ప్రభుత్వ స్కీమ్స్ వారికి అందేవిధంగా గ్రామంలో అవగాహన కల్పించడం జరుగుతుందని మాట్లాడటం జరిగింది ఇన్సూరెన్స్ పథకాల గురించి కోఆర్డినేటర్. చాంద్ సుల్తానా మాట్లాడుతూ, ప్రధాన మంత్రి. జీవన్జ్యోతి పథకం పోస్ట్ ఆఫీస్. సుకన్య సమృద్ధి యోజన పథకం ఆడపిల్లలకు ఆర్థిక సాయం అందించే ఒక మంచి పథకం అని మహిళా కోసం ప్రభుత్వం చేస్తున్న మంచి పథకాలు సద్వినియోగం చేసుకోనీ ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని అన్నారు మహిళా కానిస్టేబుల్ రమ దేవి మాట్లాడుతూ,, Child Marriages ప్రోషహించరాదని ఆడపిల్లలను మంచిగా చదివించాలని ఆడ పిల్లలపై వివక్ష చూపరాదని చట్టాల గురించి అందరూ అవగాహన కలిగి ఉండాలని సమాజంలో అందరూ కలిసి ఉండాలని అన్నారు ఈ కార్యక్రమంలో OMIF. మండల కోఆర్డినేటర్. ఎన్. నర్సింలు, ఆరోగ్య కార్యకర్తలు ఉమ రజనీ, జ్యోతి,వర్ష శోభారాణి,మంగమ్మ, భాగ్యమ్మ, వివిధ గ్రామాల మహిళలు పాల్గొన్నారు.

# వినాయక చవితి నిమజ్జనానికి ఎంఎంసీ విస్తృత ఏర్పాట్లు

- **39 నిమజ్జన కేంద్రాలు – 84 క్రేన్లు – 1,356 మంది పారిశుద్ధ్య సిబ్బంది**
- **24 గంటల పారిశుద్ధ్య, విద్యుత్, వైద్య, రక్షణ సేవలు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 23 సమయం న్యూస్**

వినాయక చవితి నిమజ్జనోత్సవాలను ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, సురక్షితంగా మరియు పర్యావరణ హితంగా నిర్వహించేందుకు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేయనున్నట్లు ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి తెలిపారు.ఎంఎంసీ పరిధిలోని మూడు జోన్లలో మొత్తం 39 నిమజ్జన కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. వీటిలో 18 చెరువులు, 7 కుంటలు/బేబీ పాండ్లు, 15 కృత్రిమ చెరువులు లేదా పోర్టబుల్ ట్యాంకులు ఉన్నాయి. సరూర్ నగర్, సఫిల్‌గూడ, షామీర్‌పేట్, ఎదులాబాద్ వంటి ప్రధాన చెరువులతో పాటు పార్కులు, క్రీడా మైదానాలు, మార్కెట్ యార్డులలో స్థానిక ప్రజలకు అనువుగా కృత్రిమ నిమజ్జన కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

**జోన్‌ల వారీగా నిమజ్జన కేంద్రాలు**

**ఉప్పల్ జోన్: 10 కేంద్రాలు**
**మల్కాజిగిరి జోన్: 20 కేంద్రాలు**
**ఎల్‌బీ నగర్ జోన్: 9 కేంద్రాలు**
**మొత్తం: 39 కేంద్రాలు**

**విద్యుత్, చెట్ల కొమ్మల తొలగింపు**

నిమజ్జన కేంద్రాలు, ఊరేగింపు మార్గాలు, చెరువులకు వెళ్లే ప్రధాన రహదారుల వద్ద ఫోకస్ లైట్లు, తాత్కాలిక విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు వేలాడుతున్న కేబుళ్లను తొలగించనున్నారు. వీధి దీపాలు 100 శాతం పనిచేసేలా విద్యుత్ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేపట్టనున్నారు. ఊరేగింపు మార్గా ల్లోచెట్ల కొమ్మలను కత్తిరించడంతో పాటు ప్రతి సర్కిల్‌కు ఒక అత్యవసర హార్టికల్చర్ బృందాన్ని రెండు షిఫ్టుల్లో 24 గంటల పాటు అందుబాటులో ఉంచనున్నారు.

**రోడ్ల మరమ్మతులు – దోమల నియంత్రణ**

నిమజ్జన మార్గా ల్లోగుంతల పూడ్చివేత, రోడ్ల మరమ్మతులు, ఫుట్‌పాత్‌లకు రంగులు వేయడం వంటి పనులు చేపట్టనున్నారు. నిమజ్జన కేంద్రాల వద్ద దోమల నివారణకు యాంటీ లార్వల్ ఆపరేషన్లు, ఫాగింగ్ నిర్వహించనున్నారు. అవసరమైన ప్రాంతాల్లో కుక్కల నియంత్రణ కోసం డాగ్ క్యాచింగ్ వాహనాలను కూడా ఏర్పాటు చేయనున్నారు.

**1,356 మంది పారిశుద్ధ్య సిబ్బందితో 24 గంటల సేవలు**

నిమజ్జనోత్సవాల సందర్భంగా 168 గణేష్ యాక్షన్ టీమ్స్ (GATs) ఏర్పాటు చేసి, 13 సర్కిళ్ల పరిధిలోని 56 ఊరేగింపు మార్గా ల్లో వాటిని మోహరించనున్నారు. ఒక్కో మార్గం సుమారు 3–4 కిలోమీటర్ల మేర ఉంటుంది. మూడు షిఫ్టుల్లో మొత్తం 1,356 మంది పారిశుద్ధ్య సిబ్బందిని విధుల్లో నియమించి 24 గంటల పాటు పారిశుద్ధ్య సేవలను అందించనున్నారు. ప్రతి గణేష్ మండపం వద్ద చెత్త సంచులను అందుబాటులో ఉంచి, GAT బృందాలతో కలిసి పారిశుద్ధ్య సిబ్బంది చెత్త, రాళ్లు, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించనున్నారు

**84 క్రేన్లు – రెస్క్యూ బృందాలు**

ప్రధాన చెరువులు, కుంటలు, కృత్రిమ నిమజ్జన ట్యాంకుల వద్ద 84 స్టాటిక్ మరియు మొబైల్ క్రేన్లను ఏర్పాటు చేయనున్నారు. వీటిలో ఉప్పల్ జోన్‌లో 19, మల్కాజిగిరి జోన్‌లో 16, ఎల్‌బీ నగర్ జోన్‌లో 49 క్రేన్లు ఉంటాయి. ప్రధాన నిమజ్జన కేంద్రాల్లో డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (DRF) బృందాల ఆధ్వర్యంలో ఈతగాళ్లు, పడవలు, లైఫ్ సేవింగ్ పరికరాలను అందుబాటులో ఉంచి చర్యలు చేపట్టనున్నారు.

**62 మొబైల్ టాయిలెట్లు**

నిమజ్జన కేంద్రాల పరిసరాల్లో ప్రజల సౌకర్యార్థం 62 మొబైల్ టాయిలెట్లను పురుషులు, మహిళలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసి 24 గంటల పాటు అందుబాటులో ఉంచనున్నారు. వీటిలో ఉప్పల్ జోన్‌లో 12, మల్కాజిగిరి జోన్‌లో 46, ఎల్‌బీ నగర్ జోన్‌లో 4 ఏర్పాటు చేయనున్నారు.

**వైద్య శిబిరాలు – సిబ్బందికి సౌకర్యాలు**

ప్రధాన నిమజ్జన కేంద్రాలు, అవసరమైన ప్రాంతాల్లో మూడు షిఫ్టుల్లో వైద్య శిబిరాలు, అంబులెన్స్‌లను ఏర్పాటు చేయనున్నారు. క్రేన్ ఆపరేటర్లు, సహాయక సిబ్బంది కోసం ప్రధాన నిమజ్జన కేంద్రాల వద్ద విశ్రాంతి గదులతో పాటు అల్పాహారం, భోజన సౌకర్యాలను కూడా కల్పించనున్నారు. ప్రజలు నిమజ్జనోత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించుకునేలా మున్సిపల్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టనున్నారు.

# భక్తి.. ఆనందం.. భావోద్వేగం.. గణనాథుని నిమజ్జనం

- **నిమజ్జన వేడుకల్లో తెలంగాణ కాలనీ మహిళల సందడి**
- **భక్తి నిండిన వీడ్కోలు.. గణనాథునికి మహిళల నీరాజనం**



**నర్సంపేట, సెప్టెంబర్ 23 (సమయం న్యూస్) :** భక్తి, భావోద్వేగాల నడుమ గణనాథునికి తెలంగాణ కాలనీ మహిళలు ఘనంగా వీడ్కోలు పలికారు. విగ్నేశ్వర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ కాలనీలో నిర్వహించిన గణపతి నవరాత్రి ఉత్సవాలు బుధవారం నిర్వహించిన నిమజ్జనంతో ముగిశాయి. నిమజ్జన కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలు చాటుకున్నారు. సంప్రదాయ దుస్తుల్లో తరలివచ్చిన మహిళలు భక్తిగీతాలు, భజనలు, నృత్యాలతో ఉత్సవంలో సందడి చేశారు. 'గణపతి బప్పా మోరియా.. వచ్చే ఏడాది మళ్లీ రావయ్యా' అంటూ నినదిస్తూ గణనాథునికి వీడ్కోలు పలికారు. భక్తుల జయజయధ్వానాలతో నిమజ్జన ఊరేగింపు ఉత్సాహంగా సాగింది. నవరాత్రి ఉత్సవాల విజయవంతానికి సహకరించిన తెలంగాణ కాలనీ ప్రజలకు, ముఖ్యంగా పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలకు విగ్నేశ్వర ఉత్సవ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# భక్తిశ్రద్ధల మధ్య.. సిద్ధి బుద్ధి గణేషుడి కల్యాణం

- **మడికొండలో అంగరంగ వైభవంగా 17వ శ్రీ గణపతి నవరాత్రి ఉత్సవాలు**



**మడికొండ, సెప్టెంబర్ 23 (సమయం న్యూస్) :** మంగళవాయిద్యాలు, భక్తుల జయజయధ్వానాలు, ప్రత్యేక పూజల మధ్య సిద్ధి బుద్ధి గణే షుడి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాజీపేట 46వ డివిజన్ మడికొండలోని మెట్టు రామన్న కాలనీ రోడ్ నంబర్ 2లో తెలంగాణ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 17వ శ్రీగణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సిద్ధి బుద్ధి గణే షుడి కల్యాణ మహోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణనాథుని సన్నిధిలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, భక్తుల జయజయధ్వానాలతో పరిసరాలు మార్మోగాయి. స్వామివారి కల్యాణాన్ని తిలకించిన భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. కల్యాణ మహోత్సవం అనంతరం భక్తులకు కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా అన్నప్రసాద వితరణ చేపట్టారు. మహిళలు, యువతీ యువకులు, కాలనీ వాసులు ఉత్సాహంగా పాల్గొ ని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తూ వస్తున్న తెలంగాణ గణేష్ ఉత్సవ కమిటీ సేవలను పలువురు అభినందించారు. కాలనీ అధ్యక్షులు పైడిపాల రవీందర్–మాధవి దంపతులు, కార్యవర్గ సభ్యుల పర్యవేక్షణలో కార్యక్రమం సజావుగా సాగింది. కమిటీ సభ్యులు కే. రవి, ఏ. సత్యనారాయణ, డి. సురేష్, పి. మురళి, టి. రవికుమార్, శాతబోయిన రాజు, డి. చంద్రమౌళి, ఎం. వేమన, జి. చక్రపాణి, ఎం. చంద్రమోహన్‌తో పాటు మహిళలు, యువతీ యువకులు, కాలనీ వాసులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపికైన 186 మందికి నియామక పత్రాలు త్వరగా ఇవ్వాలి: గద్వాల్ విజయలక్ష్మి

**హైదరాబాద్ సెప్టెంబర్ 23( సమయం న్యూస్)** : ఆర్టీసీ TST, MST పోస్టులకు ఎంపికైన 186 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా మండలి వైస్ చైర్‌పర్సన్, సీఎం ప్రజావాణి రాష్ట్ర స్థాయి ఇన్‌చార్జ్ గద్వాల్ విజయలక్ష్మి సూచించారు. ప్రజాభవన్‌లో జరిగిన సీఎం ప్రజావాణిలో అభ్యర్థులు తమ సమస్యను తెలియజేయగా, ఆమె పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ శ్రీనివాస్ రావుతో ఫోన్‌లో మాట్లాడి ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. వారం రోజుల్లో నియామక పత్రాలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# కన్నీటి కుటుంబానికి ' కాళీ ప్రసాద్ రావు' చేయూత

**బుచ్చమ్మ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థి క సాయం**



**పరకాల, సెప్టెంబర్23 (సమయం న్యూస్) :** ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచారు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పరకాల నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే డా.పగడాల కాళీ ప్రసాద్ రావు. పరకాల నియోజకవర్గం 15వ డివిజన్ పరిధిలోని గొర్రెకుంట గ్రామానికి చెందిన కాసాని బుచ్చమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన బుధవారం బుచ్చమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారిని ఓదార్చి, కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం ఆర్థిక సాయం అందజేశారు. బుచ్చమ్మ మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ల్యాదేళ్ల ప్రభాకర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు బిల్లా రమేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి గుండెబోయిన రంజిత్ యాదవ్, శక్తి కేంద్రం ఇన్‌చార్జి రవీందర్ గౌడ్, బూత్ అధ్యక్షులు నరెడ్ల రాములు, జిల్లా నాగరాజు, సుధామల రమేష్, గాజు శ్రీనివాస్ యాదవ్, నరెడ్ల శ్రీనివాస్, పేరబోయిన నాగరాజు యాదవ్, బందెల వంశీ తదితరులు పాల్గొన్నారు.

# భక్తి ఉప్పొంగాలి.. అప్రమత్తత తోడవ్వాలి..

- **ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిమజ్జన వేడుకలు నిర్వహించుకోవాలి... ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**



**వర్ధన్నపేట, సెప్టెంబర్ 23 (సమయం న్యూస్) :** భారీ వర్షాల నేపథ్యంలో వినాయక నిమజ్జన వేడుకల్లో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు సూచించారు. వర్షాల కారణంగా ఎలాంటి ఇబ్బందులు, అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు, భక్తులు సమన్వయంతో వ్యవహరించాలని కోరారు. నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలన్నారు. వర్షాల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రమాదకర ప్రాంతాలు, లోతైన నీటి ప్రాంతాల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చిన్నారులు, వృద్ధుల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వినాయకుని ఆశీస్సులతో ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలి. నిమజ్జన వేడుకలు సురక్షితంగా, ప్రశాంతంగా ముగియాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

# అర్హులకు స్మార్ట్ రేషన్ కార్డుల అందజేత



**పోతంగల్, సెప్టెంబర్ 23, ( సమయం న్యూస్ )** పోతంగల్ మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.జీపీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా పారదర్శకంగా రేషన్ సేవలు అందుతాయని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోయి సైదవ్వ, ఉప సర్పంచ్ సంజీవ్, వార్డు సభ్యులు అస్మా బేగం, రమాబాయి, కాశి తదితరులు పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.

# గణనాథుడికి ఘనంగా వీడ్కోలు



**రాయపోల్ సెప్టెంబర్ సెప్టెంబర్23( సమయం న్యూస్)** సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయంలో తొమ్మిది రోజులపాటు పూజలందుకున్న గణనాథుడికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో విగ్రహాన్ని గంగమ్మ ఒడికి చేర్చగా, అధికారులు, సిబ్బంది భక్తిశ్రద్ధలతో పాల్గొ ని గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు. యువకులు గణనాథుడికి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. దారి పొడవునా భక్తులు మంగళహారతులు ఇచ్చి స్వామివారి మొక్కులు చెల్లించుకున్నారు.

## వినాయక నిమజ్జ నం సందర్భ ంగా జరిగిన ఘర్షణ పై 18 మంది మీద కేసు నమోదు



**వలిగొండ సెప్టెంబర్ 23 (సమయం న్యూస్)**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ 23.09.2026 అర్ధ రాత్రి తెల్లవారు జామున సుమారు 02:00 గంటల సమయంలో, వలిగొండ మండలం అర్రూరు గ్రామంలో వినాయక నిమజ్జనం సందర్భంగా స్నేహ యూత్ మరియు ఫ్రెండ్స్ యూత్ సభ్యుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనపై వలిగొండ పోలీస్ స్టేషన్‌లో ఇరువర్గాలకు చెందిన 18 మందిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు కొనసాగుతోంది. వినాయక నిమజ్జన శోభయాత్ర కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు పోలీసులకు సహకరించాలని, ఎవరైనా వ్యక్తులు నిమజ్జనం సందర్భంగా గొడవలు, ఘర్షణలు లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే, వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ప్రజలు సంయమనం పాటించి, వినాయక నిమజ్జన కార్యక్రమాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని పోలీసులు సూచించారు.

## డిజిటల్ గవర్నెన్స్ లో తెలంగాణ రోల్ మోడల్

**హైదరాబాద్, సెప్టెంబర్ 23( సమయం న్యూస్):** గుడ్ గవర్నెన్స్‌కు టెక్నాలజీని జోడించి తెలంగాణను డిజిటల్ గవర్నెన్స్‌లో దేశానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.

బుధవారం బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళ్యాణ మండపంలో 'మీ సేవా డోర్ డెలివరీ సర్వీసెస్'ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, పౌర సేవలను ప్రజల ఇంటి ముంగిటకే చేర్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. 1100 టోల్ ఫ్రీ నంబర్ లేదా మీ సేవ పోర్టల్ ద్వారా స్లాట్ బుక్ చేసుకుంటే జనన, మరణ ధృవీకరణ పత్రాలు, ఆదాయ, కుల, నివాస సర్టిఫికెట్లు , ఈసీ కాపీలు, పోలీసు శాఖ సేవలు, ఐజీఆర్ఎస్ రిజిస్ట్రేషన్ సేవలు ఇంటి వద్దే అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ సేవల కోసం 70 మందికి పైగా మీ సేవా ఏజెంట్లు, వీఎల్ఈలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు మంత్రి చెప్పారు. తొలి దశలో 'క్యూర్' ప్రాంతాల్లో సేవలను ప్రారంభిస్తున్నామని, త్వరలో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు విస్తరిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఐటీఈఅండ్‌సీ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, మీ సేవా కమిషనర్ రవి కిరణ్, టీజీటీఎస్ ఎండీ సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల, అంగన్ వాడీ, తహసిల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

**మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ సెప్టెంబర్23( మండలం న్యూస్)**
మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మంగళవారం పర్యటించారు. ప్రాథమిక ఉన్నత పాఠశాలలో జరిగిన కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొని, విద్యార్థుల విద్యా సామర్థ్యాలు, ఇంగ్లీష్ ప్రావీణ్యం, ఎఫ్ఎల్ఎన్ బోధనపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో "మన అంగన్‌వాడీ–మన బాధ్యత" కార్యక్రమంలో పాల్గొని, పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం, ప్రభుత్వ సేవలు సక్రమంగా అందించాలని ఆదేశించారు. తహసిల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి, సర్టిఫికెట్ల జారీ, ప్రజావాణి దరఖాస్తులు, ఎస్ఐఆర్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో ఇన్‌చార్జి డీఈఓ మందుల శ్రీరాములు, వెల్ఫేర్ అధికారిణి శిరీష, తహసిల్దార్ రాజు, ఎంపీడీవో అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్–2026ను గడువులోగా పూర్తి చేయాలి: అదనపు కలెక్టర్ హరిప్రియ

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 23:( సమయం న్యూస్)** జడ్చర్ల నియోజకవర్గంలో ఎస్ఐఆర్–2026 ప్రక్రియను గడువులోగా పారదర్శకంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ అధికారులను ఆదేశించారు. బుధవారం జడ్చర్ల తహశీల్దా ర్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో 93.59 శాతం నోటీసుల పంపిణీ, 45.33 శాతం విచారణలు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన విచారణలు, ఫారం–6, 7, 8 దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ఓటర్లకు అవగాహన కల్పించడంలో రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు.

## గణనాథుడికి ఘనంగా వీడ్కోలు

**భూపాల పల్లి సెప్టెంబర్23( సమయం న్యూస్)**జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయం, కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో తొమ్మిది రోజులపాటు పూజలందుకున్న గణనాథుడికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో విగ్రహాన్ని గంగమ్మ ఒడికి చేర్చగా, అధికారులు, సిబ్బంది భక్తిశ్రద్ధలతో పాల్గొని గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు.

## ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

### జిల్లా అదనపు కలెక్ట ర్

**భూపాల పల్లి సెప్టెంబర్ 23( సమయం న్యూస్)**ఖరీఫ్ 2026-27 సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించేందుకు పక్కా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ పి. అశోక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో 170 కొనుగోలు కేంద్రాల ద్వారా 1,05,400 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ముంపు ప్రమాదం ఉన్న 12 కేంద్రాలకు ప్రత్యామ్నాయ స్థలాలు గుర్తించాలని, 37.60 లక్షల గోనె సంచులు ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. రైతులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్లకు చివరి అవకాశం

**ఖమ్మం, సెప్టెంబర్ 23( సమయం న్యూస్ )** 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఇంటర్మీడియట్ కళాశాలల్లో మొదటి సంవత్సరం అడ్మిషన్లకు ఈ నెల 24 నుంచి 26 వరకు చివరి అవకాశం కల్పించినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి కె. రవిబాబు తెలిపారు. ఇప్పటికీ అడ్మిషన్ పొందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ నెల 26తో అడ్మిషన్ల ప్రక్రియ ముగియనున్నందున అర్హులైన విద్యార్థులు సంబంధిత కళాశాలలను సంప్రదించాలని కోరారు

## పోలీస్ స్టేషన్, నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా ఎస్పీ



**కొడంగల్ మున్సిపల్, సెప్టెంబర్,23(సమయం న్యూస్)**
వికారాబాద్ జిల్లా కొడంగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా పర్యటించారు.ఈ సందర్భంగా నూతనంగా నిర్మాణంలో ఉన్న కొడంగల్ పోలీస్ స్టేషన్ నూతన భవనం మరియు కొడంగల్ సీఐ కార్యాలయ నూతన భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా భవనాల నిర్మాణ పనుల పురోగతి, పోలీస్ సిబ్బందికి మరియు ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన సౌకర్యాలు, కార్యాలయాల ఏర్పాటుకు సంబంధించిన అంశాలపై జిల్లా ఎస్పీ సంబంధిత పోలీస్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.నూతన భవనాల్లో పోలీస్ సిబ్బందికి అవసరమైన మౌలిక సదుపాయాలు, విధుల నిర్వహణకు అనుకూలమైన వాతావరణం, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేలా అవసరమైన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు.అలాగే నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్దేశిత సమయంలో పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్‌ను జిల్లా ఎస్పీ ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ, అవసరమైన పనులను సమన్వయంతో త్వరిత గతిన పూర్తి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా సంబంధిత అధికారులు నిర్మాణ పనుల ప్రస్తుత స్థితి, పూర్తయిన పనులు, చేపట్టాల్సిన తదుపరి పనులు తదితర అంశాలను జిల్లా ఎస్పీ కి వివరించారు.ఈ కార్యక్రమంలో పరిగి డీఎస్పీ శ్రీనివాస్, కొడంగల్ సీఐ చంద్రశేఖర్ రెడ్డి, కొడంగల్ ఎస్సై జి.వి సత్యనారాయణ తో పాటు ఇతర పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## పోతంగల్ ఉమ్మడి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా గంధపు దత్తు

- **విలేకరులే ప్రజలకు సమాచార వారధి: డాక్టర్ ఎం.ఏ. అకీమ్**




**పోతంగల్, సెప్టెంబర్ 23, ( సమయం న్యూస్)** పోతంగల్ మండల ఉమ్మడి ప్రెస్‌క్లబ్ నూతన అధ్యక్షుడిగా గంధపు దత్తు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో బీఆర్ఎస్ నాయకుడు, సామాజిక సేవకుడు డాక్టర్ ఎం.ఏ. అకీమ్ పాల్గొని దత్తును శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ అకీమ్ మాట్లాడుతూ విలేకరులు ప్రజలకు, పాలనకు మధ్య సమాచార వారధిగా పనిచేస్తారని అన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, సామాజిక అంశాలు వేగంగా ప్రజలకు చేరుతున్నాయని పేర్కొన్నారు. వాస్తవాలను నిష్పక్షపాతంగా ప్రజల ముందుకు తీసుకురావడం విలేకరుల ప్రధాన బాధ్యత అని ఆయన అన్నారు.గంధపు దత్తు గతంలో ఉపాధ్యక్షుడిగా సేవలందించి, ఇప్పుడు అధ్యక్ష బాధ్యతలు చేపట్టడం అభినందనీయమని అకీమ్ తెలిపారు. జర్నలిస్టులందరినీ సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆకాంక్షించారు.నూతన అధ్యక్షుడు గంధపు దత్తు మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రెస్‌క్లబ్ వేదికగా జర్నలిస్టుల ఐక్యతను బలోపేతం చేయడంతో పాటు మండలంలోని ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. సమాజహిత కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు ఉపయోగపడే జర్నలిజాన్ని ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు, సామాజిక సేవకులు, బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు, స్థానికులు పాల్గొని నూతన అధ్యక్షుడు గంధపు దత్తుకు శుభాకాంక్షలు తెలిపారు.

## ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తి చేయాలి



**జిల్లా అదనపు కలెక్ట ర్**

**భూపాల పల్లి సెప్టెంబర్ 23( సమయం న్యూస్)**
ఖరీఫ్ 2026-27 సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించేందుకు పక్కా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ పి. అశోక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో 170 కొనుగోలు కేంద్రాల ద్వారా 1,05,400 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ముంపు ప్రమాదం ఉన్న 12 కేంద్రాలకు ప్రత్యామ్నాయ స్థలాలు గుర్తించాలని, 37.60 లక్షల గోనె సంచులు ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. రైతులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఆయుష్ వైద్య శిబిరానికి స్పందన

**సిద్దిపేట, సెప్టెంబర్ 23( సమయం న్యూస్)** జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా సిద్దిపేటలో జిల్లా ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో ఉచిత మెగా ఆయుష్ వైద్య శిబిరం నిర్వహించారు. డీఎంహెచ్‌వో డా. ధనరాజ్ శిబిరాన్ని ప్రారంభించి, ప్రజలు ఆయుష్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.శిబిరంలో 300 మందికి పైగా రోగులకు వైద్య సేవలు అందించగా, సుమారు 100 మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. కీళ్ల నొప్పులు, అస్తమా, అలెర్జీలు, బీపీ, షుగర్, థైరాయిడ్, చర్మ వ్యాధులు తదితర సమస్యలకు ఉచిత చికిత్స, మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



## మారేళ్లపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభం

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 23( సమయం న్యూస్)** అశ్వాపురం మండలం మారేళ్లపాడులో ఎత్తిపోతల పథకాన్ని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. పంపులను ఆన్ చేసి గోదావరి జలాలను తుమ్మల చెరువుకు విడుదల చేశారు. రూ.610 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ పథకం ద్వారా తొలి విడతలో 4,300 ఎకరాలకు, దశలవారీగా 22–23 వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నట్లు తెలిపారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా పది నియోజకవర్గాల్లో సాగునీటి విస్తరణకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి తుమ్మల అన్నారు. జిల్లాలో సుమారు 16 వేల ఎకరాలకు సాగునీటి పనులకు శ్రీకారం చుట్టినట్లు కలెక్టర్ అంకిత్ తెలిపారు.



## వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**రామగుండం, సెప్టెంబర్ 23( సమయం న్యూస్):** పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం గోదావరిఖని గోదావరి బ్రిడ్జి వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం పరిశీలించారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె. అరుణ శ్రీతో కలిసి ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా అన్ని శాఖల సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా భద్రత, తాగునీరు, విద్యుత్, లైటింగ్, బ్యారికేడ్లు , క్రేన్లు తదితర సౌకర్యాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. నిమజ్జన పాయింట్ల వద్ద మూడు షిఫ్టుల్లో పారిశుధ్య సిబ్బందిని నియమించి, పరిశుభ్రతను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. క్రేన్లకు అదనపు డ్రైవర్లు , మరమ్మతుల కోసం మెకానిక్‌లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రమేష్, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.